విశాఖపట్టణం
ఆదివారం 18 అక్టోబర్ 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 247 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

హద్దులు దాటిన పోలీసులపై

# రాహుల్ ధ్వజం

నిరసన కారులపై... పోలీసుల లైంగిక వేధింపులు

దుస్తులు లాగడం, శరీరంలోని సున్నిత భాగాలపై దాడులు చేయడం దారుణం

రాజస్థాన్ కేరళలో జీరో ఎఫ్ ఐ ఆర్ లు నమోదు

7




## 82 శాతం మహిళలే

సామాజిక సమీకరణాల్లో సర్దుబాటు

సెకండ్ లిస్ట్ రిలీజ్ చేసిన టీడీపీ

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసింది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి 21 మంది అభ్యర్థులతో జాబితాను ప్రకటించగా, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అభ్యర్థిగా అబ్దుల్లాను ప్రకటించింది. రెండో జాబితాలో మహిళలకు, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించినట్లు పార్టీ వెల్లడించిన గణాంకాలు సూచిస్తున్నాయి. రెండో జాబితాలోని 22 మంది అభ్యర్థుల్లో 18 మంది మహిళలు ఉన్నారు. అంటే దాదాపు 82 శాతం మంది మహిళలే కావడం విశేషం. సామాజిక వర్గాల వారీగా చూస్తే, 16 మంది అభ్యర్థులు బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు చెందినవారు. వీరిలో ఆరుగురు బీసీలు, ఐదుగురు ఎస్సీలు, ఐదుగురు మైనారిటీ వర్గాల అభ్యర్థులు ఉన్నారు. మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యంలో ముస్లిం అభ్యర్థులకు కూడా చోటు దక్కింది. మచిలీపట్నం, నాయుడుపేట ..మిగతా 2లో

# క్షేత్రస్థాయిలో మిత్రధర్మ పాటించాలి

ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరించుకోవాలి

సీట్ల కేటాయింపులో సోషల్ రీ ఇంజనీరింగ్ చేశాం

11 మేయర్ సీట్లు.. 11 కులాలకు కేటాయించాం

ప్రజాభిప్రాయం మేరకు టికెట్లు ఇచ్చాం

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

స్థానిక ఎన్నికలపై ఎమ్మెల్యేలతో టెలికాన్ఫరెన్స్



(అమరావతి - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 ఎన్నికల ఫలితాలను మించి ఓట్ల శాతం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. గెలుస్తామన్న ధీమాతో నిర్లక్ష్యం చేయకుండా ప్రతి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలో క్షేత్రస్థాయిలో పర్యటించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అమరావతి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా జనాభా ప్రాతిపదికన అన్ని సామాజిక వర్గాలకూ సమాన అవకాశాలు కల్పించామని తెలిపారు. ప్రజాభిప్రాయం, పార్టీ కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో 50 శాతానికి పైగా మద్దతు ఉన్నవారికి ప్రాధాన్యమిచ్చామన్నారు. టీడీపీ పోటీ చేసే 11 మేయర్ స్థానాలను 11 సామాజిక వర్గాలకు కేటాయించామని చంద్రబాబు వివరించారు. క్షేత్రస్థాయిలో కూటమి నేతలంతా మిత్రధర్మం పాటిస్తూ భాగస్వామ్య పార్టీల మనోభావాలను గౌరవించాలని చంద్రబాబు సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు కూటమిని మరింత బలోపేతం చేసుకోవడం ముఖ్యమని స్పష్టం చేశారు. సీట్లు దక్కని ఆశావహులకు నిర్ణయాన్ని వివరించి, ఒకటి రెండు చోట్ల తలెత్తిన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమర్థులైన నాయకత్వం ఎదిగేందుకు సహకరించాలన్నారు. అలాగే స్థానిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు ..మిగతా 2లో

# కూటమి అరాచకాలను ఈసీ చూస్తూ ఊరుకోవడం సరికాదు

దౌర్జన్యకాండపై ఎస్ఈసీ తక్షణమే స్పందించాలి

శాసన మండలివిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టీకరణ

(విశాఖపట్నం- జయజయహే)

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షాన్ని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దౌర్జన్యకాండను రాష్ట్ర ఎన్నికల కమిషన్ చూస్తూ ఊరుకోవడం సరికాదని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగా కూటమి చేస్తున్న అరాచకాలను నియంత్రించేందుకు ఎస్ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. విశాఖపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో బొత్స మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టి ప్రజాస్వామ్యన్ని పరిరక్షించాలని కోరారు. ఎస్ఈసీ అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు ..మిగతా 2లో





## పులివెందులలో రాళ్ల దాడులు

వైసీపీ, టీడీపీ వర్గాల బాహాబాహీ

పోలీసులు గాల్లోకి కాల్పులు.. లాఠీచార్జి

ఎంపీ అవినాశ్ రెడ్డికి ఎస్పీ వార్నింగ్

2



విజయవాడ మేయర్‌గా

## వంగవీటి రాధా

2 కార్పొరేషన్లు, 12 మున్సిపాల్టీల అభ్యర్థుల ప్రకటన

జాబితా విడుదల చేసిన జనసేన

(విజయవాడ - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ పూర్తిస్థాయిలో సమాయత్తమవుతోంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీ ఎన్నికల్లో పార్టీ తరఫున రేసులో నిలబడే అభ్యర్థుల తొలి జాబితాను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. పార్టీ సీనియర్ నాయకులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం.... గెలుపే ప్రామాణికంగా ప్రజాదరణ పొందిన నాయకులకు ఈ జాబితాలో స్థానం కల్పిస్తూ ఆమోదం తెలిపారు. ఈ తొలి విడత జాబితాలో రెండు ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 ముఖ్యమైన మున్సిపాలిటీలకు ..మిగతా 2లో

# హింసాత్మక ఘటనలను సహించం

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు

ప్రతీ నామినేషన్ సెంటర్ వద్ద సీసీ కెమెరాలు

అధికారుల నిర్లక్ష్యం ఉంటే క్రమశిక్షణ చర్యలు

ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా హెచ్చరికలు



(అమరావతి - జయజయహే)

స్థానిక ఎన్నికల నామినేషన్ల తొలిరోజు చోటుచేసుకున్న పలు హింసాత్మక ఘటనల్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. నామినేషన్ల రోజు జరిగిన పలు ఘటనలపై రాజకీయ పార్టీలు ఫిర్యాదులు చేశాయని వెల్లడించారు. మీడియా సమావేశంలో మాట్లాడిన రాజుజ అనిల్‌చంద్ర పునేఠా, సమస్యాత్మత ప్రాంతాల్లో మరింత పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని తేల్చిచెప్పారు.

" రాష్ట్రంలో శాంతిభద్రతలపై రాజకీయపార్టీల నేతలు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి కలెక్టర్లకు సమాచారం ఇచ్చాం. వెంటనే పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చాం. హింసాత్మక ఘటనలను తీవ్రంగా పరిగణించాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్రచర్యలు ..మిగతా 2లో




## చిన్నారుల అశ్లీల కంటెంట్‌పై నిషేధం

పిల్లల స్వేచ్ఛ, భద్రత వేర్వేరుకాదు ఒక్కటే

తొలగించే విధానాలను మరింత పటిష్టం చేయాలి

ఇంటర్నెట్ వినియోగం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు

సోషల్ మీడియాపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

2

# 82 శాతం మహిళలే

**మొదటి పేజీ తరువాయి...**



, నందికొట్కూరు, కదిరి, ఆకివీడు ప్రాంతాలకు సంబంధించి ఐదుగురు ముస్లిం అభ్యర్థులు ఉన్నట్లు పార్టీ గణాంకాలు పేర్కొంటున్నాయి. వీరిలో నలుగురు మహిళలు కావడం గమనార్హం.

**యువతకు, విద్యావంతులకు అవకాశం!**

వయస్సు పరంగా చూస్తే, రెండో జాబితాలో ఆరుగురు అభ్యర్థులు 30 ఏళ్లు, అంతకంటే తక్కువ వయస్సు కలిగినవారు. అభ్యర్థుల సగటు వయస్సు 45.9 సంవత్సరాలుగా ఉంది. విద్యార్హతల విషయానికి వస్తే, 18 మంది మహిళా అభ్యర్థుల్లో సగం మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. టీడీపీ ఇప్పటివరకు విడుదల చేసిన రెండు జాబితాల్లో కలిపి మొత్తం 58 మంది అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో 37 మంది మహిళలు ఉండగా, ఇది మొత్తం అభ్యర్థుల్లో సుమారు 64 శాతం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారు 38 మంది ఉండటం మరో ముఖ్యమైన అంశం. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీల నుంచి 22 మంది, ఓసీ వర్గం నుంచి 20 మంది, ఎస్సీల నుంచి ఎనిమిది మంది, మైనారిటీ వర్గాల నుంచి ఏడుగురు, ఎస్టీ వర్గం నుంచి ఒకరు ఉన్నారు. వయస్సు పరంగా 18 మంది అభ్యర్థులు 40 ఏళ్లలోపు ఉండగా, వీరిలో పది మంది 35 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగినవారు. విద్యార్హతల పరంగా 34 మంది గ్రాడ్యుయేట్లు లేదా అంతకంటే ఎక్కువ చదువుకున్నవారు.

**రెండో జాబితాలోని అభ్యర్థులు వీరే:**

1. ఆకివీడు -- నీలాపూర్ షేక్ 2. బేతంచెర్ల -- బి. లోకేష్ గౌడ్ 3. బుచ్చిరెడ్డిపాలెం -- దొడ్డ విజయలక్ష్మి 4. చీరాల -- యేరికెదల హాని సుందన 5. డోన్ -- కొట్టె సుజాతమ్మ 6. గుత్తి -- గోవిందరాజులు తమ్మిక్ సెల్వి 7. గుంతకల్లు -- యశోద 8. జంగారెడ్డిగూడెం -- రొంగల అనసూయ 9. కదిరి -- షేక్ సమీరా 10. కళ్యాణదుర్గం -- బుట్టు లక్ష్మి 11. కొండపల్లి -- కన్నెబోయిన అమూల్య 12. కొవ్వూరు -- జొన్నలగడ్డ రాధారాణి 13. నాయుడుపేట -- పకీరం 14. సందిగామ -- శాకమూరి వంశీధర్ 15. నందికొట్కూరు -- ఈ.ఎం. సుబ్బరన్న 16. నర్సీపట్నం -- చింతకాయల పద్మావతి 17. ప్రొద్దుటూరు -- నంద్యాల రామవర్ధిని 18. వెంకటగిరి -- దొంతు శారద 19. ఉయ్యూరు -- చేదురుపాటి ప్రవీణ్ కుమార్ 20. ఏలేశ్వరం -- యార్లగడ్డ అఖిల 21. ఎమ్మిగనూరు -- మాచాని సునీత

**సామాజిక సమీకరణాలపై టీడీపీ దృష్టి**

మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అభ్యర్థిగా అబ్దుల్లాను పార్టీ ప్రకటించింది. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలతో పాటు యువత, విద్యావంతులకు ప్రాతినిధ్యం కల్పించేలా అభ్యర్థుల ఎంపిక సాగినట్లు ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక సమీకరణాలు, అభ్యర్థుల ప్రజాదరణ, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం కీలకంగా మారనున్నాయి. అభ్యర్థుల ప్రకటనతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ కార్యకలాపాలు మరింత ఊపందుకునే అవకాశం ఉంది.



# హింసాత్మక ఘటనలను సహించం

**మొదటి పేజీ తరువాయి...**

ఉంటాయి. హింసాత్మక ఘటనలు జరిగితే అదనపు బలగాలు ఏర్పాటు చేస్తాం. నామినేషన్ సెంటర్లలో అదనపు భద్రత కల్పిస్తాం. ప్రతి నామినేషన్ సెంటర్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో కలిపి ముగ్గురికి మాత్రమే అనుమతి. నామినేషన్ల వేళ అధికారుల నిర్లక్ష్యం ఉంటే బదిలీ, సస్పెండ్ చేస్తాం. అధికారుల నిర్లక్ష్యం ఉంటే క్రమశిక్షణా చర్యలు ఉంటాయి."అని అనిల్‌చంద్ర పునేఠా వ్యాఖ్యానించారు.

మరోవైపు నామినేషన్ల తొలిరోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఘటనలు దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల కోడ్, 144 సంక్షన్ అమల్లో ఉన్నందున సమస్యాత్మక ప్రాంతాల్లో వైఎస్సార్సీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. పలువురు నేతలను గృహనిర్బంధం చేశారు. కడప జిల్లాలో వైఎస్సార్సీపీ నేతలు అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, అంజాద్‌బాషాకు నోటీసులు అందజేశారు. అల్లర్లు, గొడవలు సృష్టించవద్దని నేతలను పోలీసులు కోరారు. 144 సెక్షన్ ఉన్నందున ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని నోటీసుల్లో పేర్కొన్నారు. మరో వైపు పల్నాడు జిల్లాలోనూ వైఎస్సార్సీపీ నేతలను గృహనిర్బంధం చేశారు. మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గృహనిర్బంధం చేశారు. నోటీసులు జారీ చేసిన పోలీసులు నామినేషన్ల దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని నరసరావుపేటలో హౌస్ అరెస్ట్ చేశారు.

# పులివెందులలో రాళ్ల దాడులు

## వైసీపీ, టీడీపీ వర్గాల బాహాబాహీ

## పోలీసులు గాల్లోకి కాల్పులు.. లాఠీచార్జి

## ఎంపీ అవినాశ్ రెడ్డికి ఎస్పీ వార్నింగ్

**(పులివెందుల - జయజయహే)**

పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు పులివెందుల నామినేషన్ కేంద్రం వద్దకు భారీగా మోహరించారు. ఈ నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించేందుకు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పులివెందులకు చేరుకున్నారు. నామినేషన్ల దాఖలుకు సమయం ముగిసినందున అక్కడి నుంచి వెళ్లిపోవాలని కడప ఎంపీకి ఎస్పీ సూచించారు. అంతేకాకుండా.. వెళ్లకపోతే అరెస్ట్ చేస్తామంటూ హెచ్చరించారు. ఎస్పీ హెచ్చరికల నేపథ్యంలో వైసీపీ శ్రేణులను ఎంపీ అవినాష్ రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అనంతరం ఎంపీ కూడా వెళ్లిపోయారు. కాగా.. పులివెందులలో నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నామినేషన్ల కోసం వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ శ్రేణులను ముందుగా అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో ఘర్షణ చెలరేగింది. దీంతో ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకున్నాయి. ఈ క్రమంలో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. చివరకు పరిస్థితిని అదుపు చేసేందుకు గాల్లో కాల్పులు జరిపారు. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఒక్కసారిగా గొడవ జరగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# కూటమి అరాచకాలను ఈసీ చూస్తూ ఊరుకోవడం సరికాదు

**మొదటి పేజీ తరువాయి...**

కల్పించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంత ముఖ్యమో, నామినేషన్ వేసే హక్కు కూడా అంతే ముఖ్యమని, కూటమి పాలనలో మాత్రం ఏ పౌరునికి ఎటువంటి స్వేచ్ఛ, హక్కులు లేకుండా బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, బెదిరింపులు చోటుచేసుకోకుండా పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడటం ఎన్నికల కమిషన్ బాధ్యత అని, అంతే తప్ప అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా వ్యవహరించడం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది అని ఆయన గుర్తు చేసారు. రాయలసీమతో పాటు పల్నాడు ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా దౌర్జన్యాలు, బెదిరింపులు, ప్రత్యర్థి అభ్యర్థులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలనే తాపత్రయంతో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కడం ప్రజాస్వామ్య సంప్రదాయం కాదని గుర్తు చేశారు. అధికార బలాన్ని ఉపయోగించి ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఆ హక్కును హరించే ప్రయత్నాలను సహించరాదని పేర్కొన్నారు.

**గ్రేటర్‌లో గెలిపిస్తే మెరుగైన పాలన అందిస్తాం:**

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రజల ముందుకు వెళ్తారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారు. మేయర్ అభ్యర్థితో పాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించి విశాఖ అభివృద్ధికి సహకరించాలని నగర ఓటర్లను కోరుతున్నా. ప్రజలకు మంచి పరిపాలన అందించడమే మా లక్ష్యం. గతంలో మేము అందించిన పాలనను మించిన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. విశాఖ ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించాలి. జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. మొత్తం 120 డివిజన్లలో పార్టీ అభ్యర్థులను బరిలోకి దించేందుకు కసరత్తు పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే 74 డివిజన్లకు అభ్యర్థులను ప్రకటించాం, తాజాగా మరో 34 డివిజన్లకు అభ్యర్థులను కూడా ఇప్పుడు ప్రకటించాం. మిగిలిన 12 డివిజన్ల అభ్యర్థుల పేర్లను ఆదివారం ఉదయం ప్రకటిస్తాం అని బొత్స తెలిపారు.

**స్థానిక ఎన్నికల్లో.. స్థానిక సమస్యలే అజెండా:**

గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానిక సమస్యలే ప్రధాన అజెండాగా ముందుకు వెళుతున్నాం. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఆరోగ్య సేవలు, విద్య, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై పాలకులు స్పష్టమైన ప్రణాళిక ఉంది. విశాఖపట్నంలో తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో గతంలో ఇలాంటి పరిస్థితులు లేవు. ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అందించిన సేవలను గుర్తించి ఇప్పుడు మరోసారి అవకాశం ఇస్తే గ్రేటర్ మేయర్ అభ్యర్థి వరుదు కల్యాణి నుంచి మరింత సమర్థవంతమైన పాలన అందిస్తాం అని బొత్స సత్యనారాయణ వెల్లడించారు.

# విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధా

**మొదటి పేజీ తరువాయి...**

అభ్యర్థులను ప్రకటించారు.

కార్పొరేషన్ల మేయర్/ అభ్యర్థులు:

ఏలూరు కార్పొరేషన్ : రెడ్డి అప్పలనాయుడు
విజయవాడ కార్పొరేషన్: వంగవీటి రాధాకృష్ణ

మున్సిపాలిటీల అభ్యర్థుల వివరాలు:

అమలాపురం : నల్లా శ్రీధర్
చిలకలూరిపేట : తోట రాజరాజేశ్వరి
గొల్లప్రోలు: కదారి తమ్మయ్య నాయుడు
నరసాపురం: కొత్తపల్లి శైలజ
నిడదవోలు: కల్లం జ్యోతి
పెడన: మట్టా శివపావని
పిఠాపురం: డాక్టర్ బీరా విజయ్ శేఖర్
పుత్తూరు: డి. ఏలుమలై
సాలూరు: గొర్లె విజయకుమారి
సామర్లకోట: పిట్టా జానకి రామారావు
తెనాలి: తోటకూర వెంకట రమణారావు
తిరువూరు: పి. మాధవి

మహిళలకు, స్థానికంగా ప్రజా సమస్యలపై పోరాడే నాయకులకు ఈ తొలి జాబితాలో పెద్దపీట వేశామని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి. త్వరలోనే మిగిలిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు సంబంధించి రెండవ జాబితాను కూడా విడుదల చేస్తామని పార్టీ ప్రతినిధులు వెల్లడించారు.



# క్షేత్రస్థాయిలో మిత్రధర్మ పాటించాలి

**మొదటి పేజీ తరువాయి...**

భంగం కలిగించేలా వైఎస్సార్సీపీ వ్యవహరిస్తోందని చంద్రబాబు ఆరోపించారు. గొడ్డలి పార్టీ చర్యలు, కుట్రలను నిశితంగా గమనిస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. అదేవిధంగా వాటిని సమర్థంగా తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు. కూటమి నేతలంతా ఐక్యంగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయాన్ని బలంగా చాటాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.




# పులివెందులలో రాళ్ల దాడులు

## వైసీపీ, టీడీపీ వర్గాల బాహాబాహీ

## పోలీసులు గాల్లోకి కాల్పులు.. లాఠీచార్జి

## ఎంపీ అవినాశ్ రెడ్డికి ఎస్పీ వార్నింగ్

**(పులివెందుల - జయజయహే)**

పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు పులివెందుల నామినేషన్ కేంద్రం వద్దకు భారీగా మోహరించారు. ఈ నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించేందుకు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పులివెందులకు చేరుకున్నారు. నామినేషన్ల దాఖలుకు సమయం ముగిసినందున అక్కడి నుంచి వెళ్లిపోవాలని కడప ఎంపీకి ఎస్పీ సూచించారు. అంతేకాకుండా.. వెళ్లకపోతే అరెస్ట్ చేస్తామంటూ హెచ్చరించారు. ఎస్పీ హెచ్చరికల నేపథ్యంలో వైసీపీ శ్రేణులను ఎంపీ అవినాష్ రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అనంతరం ఎంపీ కూడా వెళ్లిపోయారు. కాగా.. పులివెందులలో నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నామినేషన్ల కోసం వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ శ్రేణులను ముందుగా అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో ఘర్షణ చెలరేగింది. దీంతో ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకున్నాయి. ఈ క్రమంలో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. చివరకు పరిస్థితిని అదుపు చేసేందుకు గాల్లో కాల్పులు జరిపారు. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఒక్కసారిగా గొడవ జరగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# చిన్నారుల అశ్లీల కంటెంట్‌పై నిషేధం

## పిల్లల స్వేచ్ఛ, భద్రత వేర్వేరుకాదు ఒక్కటే

## తొలగించే విధానాలను మరింత పటిష్ఠం చేయాలి

## ఇంటర్నెట్ వినియోగం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు

## సోషల్ మీడియాపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ఇంటర్నెట్ వినియోగం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసుతో సంబంధం లేకుండా ఈ హక్కు పిల్లలందరికీ వర్తిస్తుందని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆన్‌లైన్ వేధింపులు, మోసాల నుంచి పిల్లలను రక్షించాలన్న పేరుతో వారికి ఇంటర్నెట్‌ను పూర్తిగా నిరాకరించలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని జీవించే హక్కు (ఆర్టికల్ 21), భావప్రకటన స్వేచ్ఛ (ఆర్టికల్ 19(1)(ఏ)) కింద ఇంటర్నెట్ యాక్సెస్ కూడా ఒక భాగమేనని పేర్కొంది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, ఇతర ఆన్‌లైన్ సేవల నుంచి పిల్లలపై లైంగిక వేధింపులు, అసభ్య సమాచారాన్ని గుర్తించి తొలగించే విధానాలను మరింత పటిష్ఠం చేయాలని కోర్టు ఆదేశించింది. పిల్లల భద్రత, వారి స్వేచ్ఛ రెండూ వేర్వేరు కాదని, పిల్లలు ఈ రెండింటినీ పొందేందుకు అర్హులని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒక నిర్దిష్ట వయసు వచ్చే వరకు పిల్లలకు ఇంటర్నెట్ హక్కు లేదనడం సరికాదని, వారి స్వేచ్ఛను హరించడమే అవుతుందని ధర్మాసనం పేర్కొంది. ఆన్‌లైన్ వేదికలపై తగిన రక్షణ చర్యలు, పర్యవేక్షణ ఉండాలని సుప్రీం కోర్టు తెలిపింది. డిజిటల్ ప్రపంచంలో పిల్లల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ తీర్పు ద్వారా స్పష్టమైంది. మొత్తంగా దేశంలో డిజిటల్ హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# నేడే దుర్గాష్టమి వేడుకలు





**బుచ్చియ్య పేట జయ జయహే**

బుచ్చయ్యపేట మండలం సీతయ్యపేట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర్ల అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్రులు మహోత్సవంలో భాగంగా ఆదివారం దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రాము భవాని మాట్లాడుతూ తెల్లవారుజామునే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కలిగిస్తామని తెలిపారు. దుర్గాష్టమి పూజలు, కుంకుమ పూజలు, మరియు విష్ణు, లలిత, దుర్గా సహస్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము జరుపబడును తెలిపారు. మధ్యాహ్నం భారీగా 5000 మంది భక్తుల వరకు అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం సాయంత్రం దుర్గా మల్లేశ్వర్ల అమ్మవారి త్రి వీధి కార్యక్రమము మేళతాళములతో, సన్నాయి మేళలతో ,సేవ గరిడీలతో ,తప్పుడు గుళ్ళతో, కోలాటంలతో, చిటికెలు భజనలతో, విద్యుత్ అలంకరణలతో భారీ బాణాసంచాతో అమ్మవారు ఊరేగింపుగా ఆత్యంత వైభవంగా నిర్వహించబడును తెలిపారు. అనంతరం అగ్నిగుండం తొక్కుట, తెప్పోత్సవం నిర్వహించని ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ తిరువీధి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ వారు కోరుకుంటున్నారని తెలిపారు.



## స్థానిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్ధులను గెలిపించండి

**వైసిపి నాయకురాలు ఈర్లె అనురాధ**

**దేవరాపల్లి, అక్టోబర్ 17, జయ జయహే**

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించి విజయ దంకా మోగించాలని నియోజకవర్గం సమన్వయకర్త ఈర్లె అనురాధ అన్నారు. మండల కేంద్రంలో శనివారం దేవరాపల్లి గ్రామ వైసీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన అనురాధ మాట్లాడుతూ మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడును గెలిపించి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల వైసిపి అధ్యక్షులు బూరె బాబురావు మాట్లాడుతూ తనను ఎంపీపీ అభ్యర్థిగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలు నాయుడు ఆశీస్సులతో పార్టీ అవకాశం కల్పించిందని, తనతో పాటు ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి పార్టీ విజయానికి కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కర్రి సత్యం, వరదపురెడ్డి లలిత నాయుడు, గండిపడాల అప్పలరాజు, కె.వి రమణ( ఎల్. ఐ. సి ), వేచలపు అప్పలనాయుడు, జాగరపు వెంకటరావు, గొర్రెపోటు రమాదేవి, చొక్కాకుల రమణ, గంగవంశం సంతోష్, వరదపురెడ్డి అప్పలనాయుడు, కొరుప్రోలు శ్రీను, ఉల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ పార్వతీ దేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు...

**నిడదవోలు జయ జయ ప్రతినిధి:**

నిడదవోలు పట్టణంలోని దేనబంధు వారి వీధిలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ దేవి అమ్మవారి సన్నిధిలో శ్రీదేవి నవరాత్రుల 12వ వార్షికోత్సవం సందర్భంగా కుంకుమ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ పార్వతీ దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ఈ పూజా కార్యక్రమానికి దాతలుగా బండి రామ్ గోపాల్ (రాంబాబు), శ్రీమతి గౌరీ జాన్సీ లక్ష్మి, వారి కుమారులు నాగేంద్ర బాబు, బాల నాగ సిద్ధార్థ సహకారం అందించారు. కార్యక్రమంలో ముత్తైదువులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, కుటుంబాల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంతో ఆలయ పరిసరాల్లో భక్తిమయ వాతావరణం నెలకొంది. శ్రీ పార్వతీ దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తుల సహకారం, దాతల సేవాభావంతో విజయవంతంగా కొనసాగింది. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు భక్తుల్లో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



## శ్రీ కోటసత్తెమ్మ ఆలయంలో ఘనంగా సరస్వతి పూజలు

**మూల నక్షత్రం సందర్భంగా పూజల్లో పాల్గొన్న వెయ్యి మంది విద్యార్థులు**

**నిడదవోలు జయ జయ ప్రతినిధి:**

తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని చదువుల తల్లి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు విద్యాభివృద్ధిలో రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలని పూజల సందర్భంగా ప్రార్థించారు. దాతల సహకారంతో సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి




## వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఐతం విద్యార్థుల ఘనత

**చదువు తో క్రీడలు భవిష్యత్తుకు పునాదులు**

**టెక్కలి అక్టోబర్ 17 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 15న నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పథకాలు సాధించడం గర్వకారణమని చదువుల తోపాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించడం హర్షదాయకమని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థి దుర్గాప్రసాద్ , కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థిని బో డ్డ గేయామృతా, ఎస్ సంపత్ వినాయక్, జస్వంత్, పలు విభాగాల్లో పథకాలు సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, వ్యాయామ విభాగం సిబ్బంది లక్ష్మణమూర్తి, మురళీమోహన్, తేజస్వి లు పాల్గొన్నారు.



## కొయ్యూరు, సింగవరం దుర్గమ్మ ఆలయాలకు సారె సమర్పణ

**కొయ్యురు : (జయ జయహే న్యూస్ ) అక్టోబర్ 18,**

మండలంలోని కొయ్యూరు, సింగవరం గ్రామాల్లో కొలువైన దుర్గమ్మ ఆలయాలకు శుక్రవారం భక్తులు సారె సమర్పించారు. గ్రామాల నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో భారీ ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకువెళ్లారు. దుర్గమ్మ మాల ధరించిన భక్తులు, పెద్ద సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సారెతో పాటు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు సమర్పించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బుచ్చియ్యపేట ఎంపీపీ రేసులో గేదెల

**బుచ్చియ్యపేట జయ జయహే**



బుచ్చయ్యపేట. అధికార కూటమి నుండి బుచ్చయ్యపేట మండల ఎంపిపిగా విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అభ్యర్థిత్వం దాదాపుగా ఖరారు కానుంది. ఎంపిపి ఓసి జనరల్ కు కేటాయించడంతో కాపు సామాజిక వర్గానికి చెందిన టిడిపి నేత సత్యనారాయణ బరిలో నిలిచే అవకాశం ఉంది. ఇటీవల ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, అబ్జర్వర్ గాయత్రి దేవి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మెజారిటీ టీడీపీ నాయకులు గేదెల సత్యనారాయణ పేరునే ప్రతిపాదించారు. ఆయన మండల టిడిపిలో కీలక నాయకుడిగా ఉన్నారు. సత్యనారాయణకుఆర్థిక, అంగ బలంతో పాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. ఎన్నికల పోల్ మేనేజ్మెంట్ చేయడంలో ఆయనకు విశేష అనుభవం ఉంది. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకి అనుంగు శిష్యుడిగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే ఆయనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. తన స్వగ్రామం కోమల్లపూడిలో రెండు దశాబ్దాలుగా తన తల్లిదండ్రులు ఇతర కుటుంబ సభ్యుల సర్పంచిగా కొనసాగుతున్నారు. కోమాళ్లపూడిని అన్ని విధాలా అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజు ఆదేశాలే తనకు శిరోదార్యమని, తనకు ఏ బాధ్యతలు అప్పగించినా కమిట్మెంట్ తో పని చేస్తాను అన్నారు. బుచ్చయ్యపేట మండలంలో అన్ని స్థానాలలో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తాను అన్నారు.




## అక్టోబర్ 13 'దళిత్ రైట్స్ డే'

**తిరుచానూరు ఆలయ ప్రవేశానికి శతాబ్ది ఉత్సవాలు**

**రాజమహేంద్రవరం: అక్టోబర్ 17 : జయ జయహే:**

దళితుల ఆత్మగౌరవం, సమానత్వం, మతపరమైన హక్కుల పరిరక్షణ కోసం అక్టోబర్ 13వ తేదీని 'దళిత్ రైట్స్ డే'గా పాటించాలని మాజీ కేంద్ర మంత్రి, చిత్తూరు మాజీ ఎంపీ చింతా మోహన్ పిలుపునిచ్చారు. 1925 అక్టోబర్ 13న తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మురుగన్ అనే దళితుడు ప్రవేశించి కర్పూర హారతి ఇచ్చిన చారిత్రక ఘటనకు గుర్తుగా శతాబ్ది ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూకులవివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం, సమాన హక్కుల పరిరక్షణే ఉత్సవాల ప్రధాన లక్ష్యమన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, ఓబిసి ఓటర్ల హక్కులకు భంగం కలగకూడదని చింతా మోహన్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా సమస్యలు, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్షా అనుసరిస్తున్న విధానాలు ప్రజాస్వామ్యానికి, సామాజిక సామరస్యానికి విఘాతం కలిగించే అవకాశం ఉందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## 86 రవాణా సేవలు ఆన్‌లైన్‌లోనే!

**దళారులను నమ్మొద్దు.. అదనపు చెల్లింపులు వద్దు**

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 17:**



రవాణా శాఖ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు 'వాహన్', 'సారథి' పోర్టల్ల ద్వారా 86 రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తూర్పు గోదావరి జిల్లా రవాణా శాఖాధికారి ఆర్. సురేష్ తెలిపారు. అర్హతను బట్టి ఇంటి నుంచే దరఖాస్తు చేసుకుని సేవలు పొందవచ్చని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వాహన యాజమాన్య హక్కుల బదిలీ, ఫైనాన్స్ నోటింగ్, ఫైనాన్స్ టెర్మినేషన్, లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, చిరునామా మార్పు తదితర సేవలను ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. సాంకేతిక నవీకరణల కారణంగా కొన్ని సేవల ఆమోదంలో ఆలస్యం జరుగుతున్న నేపథ్యంలో అక్టోబర్ 14 నుంచి రాజమహేంద్రవరం రవాణా శాఖ కార్యాలయంలో సంబంధిత సేవలకు ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో మాన్యువల్ డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రజలు అధికారిక పోర్టల్లు, మీ-సేవ లేదా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా సేవలు పొందాలని, ప్రభుత్వ నిర్ణీత రుసుములనే చెల్లించాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని హెచ్చరించారు. సేవలకు సంబంధించి సమస్యలు లేదా ఫిర్యాదులు ఉంటే 9281607020 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా రవాణా శాఖాధికారి కోరారు.



## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న భవానీ భక్తులు

**దేవరాపల్లి, అక్టోబర్ 17, జయ జయహే :**

మండలంలోని మారేపల్లి పాండవుల కొండపై వెలసియున్న కలియుగ భగవానుడు శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామిని శనివారం దుర్గాదేవి భక్తులు దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం చుట్టూ భవానీ భక్తులు తిరిగి స్వామివారి మండపంలో భజనలు చేశారు. కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణమంతా భవాని భక్తులతో సందడిగా మారింది.

For a pure tomorrow.. జయహో

శరన్నవరాత్రులు ప్రత్యేక శీర్షిక 8వ రోజు

# దుర్గాదేవి అలంకరణ

**దుర్గాష్టమి శుభాకాంక్షలుతో....**



దుర్గాదేవి ఆదిపరాశక్తి స్వరూపిణి. దుర్గముడు అనే రాక్షసుడిని సంహరించినందున దుర్గా అని పేరు వచ్చింది. శరన్నవరాత్రులలో 8వ రోజును దుర్గాష్టమి అంటారు. ఈ రోజు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజించడం అత్యంత శుభప్రదం.

**దుర్గాష్టమి విశిష్టత:**

ఆశ్వయుజ శుద్ధ అష్టమి నాడు దుర్గాష్టమి జరుపుకుంటారు. ఈ రోజునే దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించడానికి ఆయుధాలు ధరించిందని పురాణ కథ. ఈ రోజున ఆయుధ పూజ, కన్యా పూజ చేస్తారు. ఈ రోజు చేసే పూజ కోటి రెట్లు ఫలితాన్ని ఇస్తుందని నమ్మకం.

దుర్గాదేవి అలంకారం విధానం:

దుర్గాష్టమి నాడు అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేస్తారు.

**వస్త్రం:**

ఎరుపు రంగు పట్టు చీర, ఎరుపు రంగు శక్తికి, ధైర్యానికి ప్రతీక.

ఆభరణాలు:

బంగారు కిరీటం, నాగాభరణాలు, ఎరుపు గాజులు, కుంకుమ బొట్టు.

**ఆయుధాలు:**

8 చేతులలో శంఖం, చక్రం, త్రిశూలం, ఖడ్గం, గద, ధనుర్బాణాలు, పద్మం ధరించి ఉంటుంది

పూలు: ఎర్ర మందారం, కనకాంబరం, మల్లెపూలతో అలంకరణ. నుదుటన పెద్ద కుంకుమ బొట్టు.

వాహనం: సింహం పై ఆసీనురాలై ఉంటుంది. ఇది ధైర్యానికి సంకేతం.

**దుర్గాష్టమి పూజా విధానం:**

ఉదయాన్నే అమ్మవారిని గంగాజలంతో అభిషేకించి, ఎర్ర చీర కట్టి, కుంకుమార్చన చేయాలి. దుర్గా సప్తశతి పారాయణం, దుర్గా అష్టోత్తరం చదవాలి. 9 మంది చిన్న బాలికలకు కన్యా పూజ చేసి వస్త్రాలు, పండ్లు ఇవ్వాలి.

**ప్రత్యేక నైవేద్యాలు:**

దుర్గాష్టమి నాడు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు:

పులిహోర: అమ్మవారికి అత్యంత ప్రీతికరం. చింతపండు పులిహోర.

చక్ర పొంగలి, బెల్లం పొంగలి: తీపి నైవేద్యం.

**పరమాన్నం:**

పాలు, బియ్యం, బెల్లంతో చేసిన పరమాన్నం.

వడలు: 9 గారెలు నైవేద్యంగా పెడతారు.

కొబ్బరి అన్నం, పానకం, వడపప్పు: వేడిని తగ్గించే నైవేద్యాలు.

పంచామృతం: పాలు, పెరుగు, నెయ్యి, తేనె, బెల్లం కలిపినది.

ఈ నైవేద్యాలను అమ్మవారికి నివేదించిన తర్వాత ముత్తైదువులకు పంచితే సౌభాగ్యం కలుగుతుందని నమ్మకం.

**ముగింపు:**

దుర్గాదేవి ఆరాధన వల్ల భయం, శత్రు బాధలు తొలగి, ధైర్యం, విజయం, సుఖ సంతోషాలు కలుగుతాయి. దుర్గాష్టమి రోజున అమ్మవారిని భక్తితో పూజించిన వారికి కోరిన కోరికలు నెరవేరుతాయి.

# మారీచుడు-చెడుతో సహవాసం చేసే భయం

## ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన మారీచుడు

**రామాయణంలో మారీచుడు కేవలం బంగారు జింకగా కనిపించి సీతాపహరణకు దోహదపడిన రాక్షసుడు మాత్రమే కాదు. చెడు గురించి తెలిసి కూడా భయంతో దానికి సహకరించిన వ్యక్తి ఎదుర్కొనే విషాదానికి అతను ప్రతీక. గతంలో రాక్షస ప్రవృత్తితో జీవించిన మారీచుడు శ్రీరాముని శక్తిని ప్రత్యక్షంగా అనుభవించిన తరువాత భయపడి ఏకాంత జీవితాన్ని ఎంచుకుంటాడు. శ్రీరామునితో శత్రుత్వం వినాశనానికి దారితీస్తుందని అతనికి స్పష్టంగా తెలుసు.**




సీతను అపహరించాలనే తన కుట్రను రావణుడు వివరించి, మారీచుడిని బంగారు జింక రూపంలో సహకరించమని కోరినప్పుడు అతను తీవ్రంగా హెచ్చరిస్తాడు. శ్రీరాముని భార్యను అపహరించడం లంక వినాశనానికి దారితీస్తుందని చెబుతాడు. కానీ రావణుడు అతని సలహాను తిరస్కరించి, సహకరించకపోతే చంపుతానని బెదిరిస్తాడు. చివరకు మారీచుడు ప్రాణభయంతో కుట్రలో భాగమవుతాడు.

**తప్పు తెలిసినా చేసిన సహకారం**

మారీచునికి మంచి--చెడు మధ్య తేడా తెలియకపోలేదు. రావణుని నిర్ణయం అనైతికమని, దాని పరిణామాలు భయంకరంగా ఉంటాయని అతను గ్రహించాడు. అయినప్పటికీ తెలిసిన చెడును ధైర్యంగా తిరస్కరించలేకపోయాడు. బంగారు జింకగా మారి సీతను ఆకర్షించి, రామలక్ష్మణులను ఆశ్రమానికి దూరం చేశాడు. తద్వారా సీతాపహరణకు మార్గం సుగమమైంది.

చెడును స్వయంగా ఆలోచించినవాడే నేరస్థుడు కాదు; అది అమలయ్యేందుకు సహకరించినవాడు కూడా దాని ఫలితాల్లో భాగస్వామే. "నేను ఇష్టపడి చేయలేదు", "నన్ను బెదిరించారు", "పైవారి ఆదేశం పాటించాను" వంటి కారణాలు నైతిక బాధ్యతను పూర్తిగా తొలగించవు.

**ఆధునిక వ్యవస్థల్లో మారీచులు**

నేటి సమాజంలో అవినీతి లేదా అక్రమాలు ఒక్క వ్యక్తి వల్ల మాత్రమే జరగవు. తప్పుడు పత్రాన్ని తయారుచేసే ఉద్యోగి, నిజం కాదని తెలిసి సంతకం చేసే అధికారి, నేరాన్ని దాచిపెట్టే సహాయకుడు, తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేసే వ్యక్తి---వీరందరూ అక్రమ వ్యవస్థకు సహకరిస్తారు.

ఒక సంస్థాధిపతి ఉద్యోగులను మోసం చేయమని ఆదేశించినప్పుడు, ఉద్యోగం పోతుందనే భయంతో ఆ పని చేసే వ్యక్తి మారీచుని పరిస్థితిని గుర్తుచేస్తాడు. విద్యాసంస్థలో నకిలీ పరిశోధన, కొనుగోలు చేసిన ప్రచురణలు లేదా తప్పుడు ధ్రువపత్రాలు ఉన్నాయని తెలిసి కూడా మౌనంగా ఉండటం విద్యా నైతికతను దెబ్బతీస్తుంది.

**చెడు సాంగత్యం తెచ్చే బంధనం**

చెడుతో సన్నిహిత సంబంధం కొనసాగిస్తే ఒక దశలో దాని నిర్ణయాలకు సహకరించాల్సిన ఒత్తిడి ఏర్పడుతుంది. మొదట చిన్న తప్పుగా కనిపించినది తరువాత పెద్ద నేరానికి దారి తీస్తుంది. చెడు స్నేహాల ప్రభావంతో విద్యార్థులు వ్యసనాలు, హింస, ఆన్‌లైన్ మోసాలు లేదా నేరాలకు పాల్పడవచ్చు. ప్రారంభంలో కేవలం స్నేహితుల వెంట వెళ్లినవారు చివరకు చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవచ్చు.

అందువల్ల సాంగత్యాన్ని ఎంచుకోవడం కూడా ఒక నైతిక నిర్ణయమే. మన చుట్టూ ఉన్నవారు మనలోని మంచిని ప్రోత్సహిస్తున్నారా, లేక భయం, అబద్ధం, స్వార్థం వైపు నడిపిస్తున్నారా అని పరిశీలించాలి.

**భయాన్ని మించిన నైతిక ధైర్యం**

మారీచుడు రావణుడిని ఎదిరించి ఉంటే ప్రాణం కోల్పోయే ప్రమాదం ఉండేది. కానీ కుట్రలో భాగమై చివరకు రామబాణానికి బలయ్యాడు. అంటే చెడుకు సహకరించడం ద్వారా అతను తన ప్రాణాన్ని కూడా రక్షించుకోలేకపోయాడు. భయంతో చేసిన రాజీ తాత్కాలిక ఉపశమనాన్ని ఇవ్వవచ్చు; కానీ దీర్ఘకాలంలో మరింత ప్రమాదాన్ని తీసుకురాగలదు.

అన్యాయ ఆదేశాన్ని తిరస్కరించడానికి నైతిక ధైర్యం అవసరం. ఉద్యోగులు చట్టపరమైన రక్షణలను తెలుసుకోవాలి; సంస్థలు తప్పులను వెల్లడించే వారికి భద్రత కల్పించాలి; కుటుంబాలు పిల్లలకు చెడు ఒత్తిడిని ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పాలి.

**చెడుకు సాధనంగా మారకూడదు**

చెడును గుర్తించడం మొదటి అడుగు మాత్రమే. దానిని హెచ్చరించి, దానితో సహకరించకుండా నిలబడటమే అసలైన పరీక్ష. మంచి ఆలోచనలు ఉన్నప్పటికీ వాటిని ఆచరించే ధైర్యం లేకపోతే అవి మనల్ని రక్షించలేవు.

మారీచుని కథ ఆధునిక మనిషికి తీవ్రమైన హెచ్చరికను అందిస్తుంది---చెడును స్వయంగా చేయకపోవడం మాత్రమే మంచితనం కాదు; చెడు చేతిలో సాధనంగా మారకుండా ఉండటం కూడా మన నైతిక బాధ్యత.

ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు



# దశమహావిద్యలు-ఆదిపరాశక్తి యొక్క

# పది మహా జ్ఞాన రూపాలు

**విద్య అంటే కేవలం జ్ఞానం కాదు, విముక్తి. మనం సాధారణంగా దేవిని ఒకే రూపంలో చూస్తాం. కానీ శాక్తేయ తంత్ర శాస్త్రం చెబుతుంది - ఆ ఒక్క ఆదిపరాశక్తే తనను తాను పది విధాలుగా విభజించుకుని సృష్టి, స్థితి, లయలను, అంతకు మించి మోక్షాన్ని కూడా నడిపిస్తోందని. వాటినే దశమహావిద్యలు అంటారు.**




'దశ' అంటే పది, 'మహా' అంటే గొప్పదైన, 'విద్య' అంటే - చదువు కాదు, బ్రహ్మాన్ని తెలుసుకునే పరమ జ్ఞానం. ఈ పది రూపాలు భయంకరంగా కనిపించినా, ప్రతి రూపం వెనుక ఒక గొప్ప తాత్విక రహస్యం ఉంది.

ఈ కథకు మూలం దక్ష యజ్ఞం. శివుడు లేకుండా యజ్ఞం చేస్తున్న తండ్రి దక్షుడిని చూడటానికి సతీదేవి వెళ్లాలనుకుంది. శివుడు వద్దన్నాడు. అప్పుడు అమ్మవారికి కోపం వచ్చి, తన నిజస్వరూపాన్ని చూపించింది. శివుడు ఎటు చూసినా అమ్మవారే. పది దిక్కులలో పది రూపాలుగా నిలిచింది. శివుడే భయపడి ఆమెను యజ్ఞానికి వెళ్ళనిచ్చాడు. అదే దశమహావిద్యల ఆవిర్భావం.

**1. కాళీ**

కాలాన్ని మింగే తల్లి

నల్లని రూపం, నాలుక బయటకు చాచి, రక్తమాల. చూడగానే భయం. కానీ అర్థం ఏమిటి?

కాళీ అంటే కాలం. కాలాన్ని కూడా తినేస్తుంది కాబట్టి కాళీ. మన అహంకారాన్ని, భయాన్ని, మరణ భయాన్ని నరికేస్తుంది. ఆమె చేతిలోని ఖడ్గం అజ్ఞానాన్ని నరుకుతుంది. దిగంబరంగా ఉండటం అంటే ఆమెకు ఏ ముసుగులూ లేవు, సత్యం నగ్నంగా ఉంటుందని అర్థం. జీవితంలో ఏదైనా వదిలేయాలంటే, భయం నుండి బయటపడాలంటే కాళీని ఉపాసించాలి.

**2. తారా**

కష్టాల నుండి తరింపజేసేది

సముద్ర మథనంలో హాలాహలం వచ్చినప్పుడు శివుడు మింగి స్పృహ తప్పాడు. అప్పుడు ఆదిశక్తి తారా రూపంలో వచ్చి, శివుడిని తన ఒడిలో పడుకోబెట్టుకుని, స్తన్యం ఇచ్చి బ్రతికించిందని పురాణం. తారా అంటే తరింపజేసేది, నక్షత్రం. జీవితం అనే సముద్రంలో మునిగిపోతున్నప్పుడు దిక్సూచి లాంటిది. మాటలకు, జ్ఞానానికి, గురువుకు అధిష్టాన దేవత. నీల సరస్వతి అని కూడా అంటారు.

**3. త్రిపుర సుందరి**

షోడశి అందానికి అందం

పదహారేళ్ల బాలికలా, అత్యంత సౌందర్యంతో ఉంటుంది. ఈమె లలితా త్రిపుర సుందరి. 'త్రిపుర' అంటే మనస్సు, బుద్ధి, చిత్తం అనే మూడు పురాలు. వాటిని శాసించే సుందరి. ఈ విశ్వం మొత్తం ఆమె ఆట వస్తువు. శ్రీచక్రానికి అధిష్టాన దేవత. కోరిక అంటే తప్పు కాదు, కోరికను పవిత్రంగా మారిస్తే అదే మోక్షానికి దారి అని చెబుతుంది.

**4. భువనేశ్వరి**

విశ్వాన్ని గర్భంలో మోసే తల్లి ఆమె శరీరమే ఈ భూమి, ఆకాశం. భువనానికి ఈశ్వరి. చాలా శాంతంగా, సౌమ్యంగా, సింహాసనంపై కూర్చుని ఉంటుంది. మనం ఎవరమైనా ఆమె గర్భంలోనే ఉన్నాం. విశాల దృక్పథాన్ని ఇస్తుంది. నేను, నాది అనే చిన్న ఆలోచన నుండి "అంతా మనమే" అనే విశాల ఆలోచనకు తీసుకెళుతుంది.

**5. ఛిన్నమస్తా**

తన తలను తానే నరుక్కున్న తల్లి

ఇది అత్యంత ఉగ్రమైన, అర్థం చేసుకోవడానికి కష్టమైన రూపం. తన తలను తానే ఖండించుకుని, తన రక్తాన్ని తన ఇద్దరు సేవికలకు తాగిస్తుంది. భయంకరంగా ఉందా? దీని అర్థం త్యాగం. తల్లి తన ప్రాణాన్ని ఇచ్చి అయినా బిడ్డల ఆకలి తీరుస్తుంది. యోగ శాస్త్రంలో ఇది సుషుమ్నా నాడిలో ప్రాణాన్ని పైకి తీసుకెళ్లడానికి సంకేతం. కామాన్ని జయించడానికి ఈ ఉపాసన.

**6. భైరవి**

తపస్సుకు అగ్ని రూపం

తపస్సు చేస్తే వచ్చే తేజస్సు ఈమె. ఎర్రగా, అగ్నిలా ఉంటుంది. భైరవుడి శక్తి భైరవి. మనలోని బద్ధకాన్ని, చెడు అలవాట్లను కాల్చేస్తుంది. క్రమశిక్షణ, తపస్సు, పట్టుదల కావాలంటే భైరవి ఆరాధన.

**7. ధూమావతి**

శూన్యంలోని జ్ఞానం

ఒక ముసలి వితంతువులా, చీపురు పట్టుకుని, కాకి మీద వెళ్తూ ఉంటుంది. అందరూ భయపడే రూపం. కానీ ఆమె బోధ ఏమిటి? జీవితంలో అన్నీ పోయిన తర్వాత, భర్త, సంపద, యవ్వనం అన్నీ పోయిన తర్వాత కూడా ఒక జ్ఞానం మిగులుతుంది. ఆ శూన్యంలోనే పరమ సత్యం ఉంటుంది. వైరాగ్యానికి, ఓటమి నుండి పాఠం నేర్చుకోవడానికి ఈ తల్లి గురువు.

**8. బగళాముఖి**

శత్రువు నాలుకను పట్టుకునే తల్లి పసుపు రంగు చీరలో, ఒక రాక్షసుడి నాలుకను లాగి కొడుతున్నట్టు ఉంటుంది. శత్రువు అంటే బయటి వ్యక్తి కాదు, మన లోపలి శత్రువులు అబద్ధం, అనవసర మాటలు. నోటిని అదుపు చేసే శక్తి. కోర్టు కేసులు, వాగ్వాదాలు, ఎవరైనా మన గురించి చెడుగా మాట్లాడుతుంటే ఆపే శక్తి బగళాముఖి.

**9. మాతంగి**

మిగిలిన అన్నాన్ని తినే సరస్వతి

ఈమె ఉచ్ఛిష్ట మాతంగి. అంటే ఎంగిలి పదార్థాలను స్వీకరించేది. బ్రాహ్మణ సరస్వతి శుభ్రతను, నియమాన్ని ఇష్టపడితే, మాతంగి నియమాలకు అతీతమైన కళ. జానపద సంగీతం, గిరిజన కళ, నిషిద్ధమైన విద్యలు అన్నీ ఈమె పరిధిలోనే. కళాకారులకు, రచయితలకు ఆరాధ్య దేవత. అసలు సృజనాత్మకత అంటే పరిశుభ్రతలో కాదు, స్వేచ్ఛలో పుడుతుందని చెబుతుంది.

**10.కమలా - చివరి రూపం లక్ష్మి**

చివరకు వచ్చేది కమల, అంటే లక్ష్మీదేవి. పది విద్యలు నేర్చుకున్న తర్వాత వచ్చే సంపద. ఇది కేవలం డబ్బు కాదు, ధాన్య లక్ష్మి, ధైర్య లక్ష్మి, విజయ లక్ష్మి. కాళీతో మొదలైన భయంకర ప్రయాణం కమలతో సౌభాగ్యంగా ముగుస్తుంది. జ్ఞానం చివరకు ఐశ్వర్యాన్ని ఇస్తుందని దీని అర్థం.

**ఇవి పది వేరే వేరే దేవతలు కావు. ఒకే స్త్రీ జీవితంలోని పది దశలు.**

కూతురిగా త్రిపుర సుందరి, భార్యగా భువనేశ్వరి, తల్లిగా తారా, కోపంలో కాళీ, త్యాగంలో ఛిన్నమస్తా, ఒంటరితనంలో ధూమావతి, చివరకు సంపూర్ణతలో కమలా.

దశమహావిద్యలను పూజించడం అంటే గుడికి వెళ్లి రావడం కాదు . మనలోని పది రకాల స్త్రీ శక్తులను గుర్తించడం, గౌరవించడం.స్త్రీలో కాళీ కూడా ఉంది, కమల శక్తి కూడా ఉంది. అన్ని పనులకు స్త్రీ శక్తి అత్యంత ప్రధానము.



రచన
ఏ. బాల సౌజన్యకుమారి,
తెలుగు ఆచార్యులు,
నంది అవార్డు గ్రహీత,
ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త.

# రైతు బజార్లలో నాసిరకం వంకాయలు

**- రూ. 12కి దొరికే పొరుగు రాష్ట్రాల పంటకు రైతు బజార్ లో రూ. 30..!**

**- కోల్‌కతా, రాయ్ పూర్ సరుకుతో అధికారులకు కాసుల పంట !**

**- స్థానిక రైతుల పొట్టకొట్టి.. విశాఖ ప్రజలకు స్థానిక రుచిని దూరం చేస్తున్నదెవరు?**

**విశాఖపట్నం:**

రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను అందించాల్సిన రైతు బజార్లలోనే స్థానిక రైతులకు అన్యాయం జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖ పరిసర ప్రాంతాల్లో పండే నాణ్యమైన వంకాయలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, రాయ్‌పూర్, కోల్‌కతా, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వంకాయలను తీసుకొచ్చి రైతు బజార్లలో విక్రయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక రైతుల నుంచి వంకాయల కొనుగోళ్లను తగ్గించి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వంకాయలను కిలో కేవలం రూ. 12కే కొని రైతు బజార్ లో దాదాపు రూ. 30కి అమ్మిస్తున్నారంటే ఆ వ్యత్యాసం ఎవరి జేబుల్లోకి పోతుందో ఆ ఆశాఖ ఉన్నతాధికారులకే తెలియాలి. తక్కువ ధరకు తెచ్చిన పంటకు మార్కెట్‌లో చోటు కల్పించడం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పైగా తక్కువగా ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడిన మన రైతుల పంటను, నాణ్యత లేని నాసిరకం పంటకూ ఒకే రేటు పెట్టి మన రైతుల నోట్లో మట్టి కొట్టే యత్నం చేస్తున్నారు. ఈ కారణంగా విశాఖ



పరిసర ప్రాంత రైతులు దారుణంగా నష్టపోతున్నారు. సబ్బవరం, దేవరాపల్లి, కోటపాడు, ఆనందపురం మండలాల్లో నాణ్యమైన వంకాయ పంట సాగవుతోంది. స్థానిక వాతావరణంలో పండే ఈ వంకాయలకు రుచి, నాణ్యత ప్రత్యేకమని వినియోగదారులు చెబుతుంటారు. తెలుగు ఇళ్లలో ప్రత్యేక స్థానం ఉన్న వంకాయ కూర, గుత్తి వంకాయ వంటి వంటకాలకు స్థానికంగా పండిన వంకాయలు మరింత రుచిని అందిస్తాయి. అయినప్పటికీ, స్థానిక రైతుల పంటకు తగిన ప్రాధాన్యత లభించడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

**తక్కువ ధరకు కొనుగోలు.. అధిక లాభాల వ్యూహమా?**

ఇతర ప్రాంతాల్లో పండించిన వంకాయలను తక్కువ ధరకు కొనుగోలు చేసి విశాఖ రైతు బజార్లలో విక్రయించడం వల్ల స్థానిక రైతులకు మార్కెట్ అవకాశాలు తగ్గుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. స్థానికంగా పంట పండించిన రైతులు తమ దిగుబడిని అమ్ముకోలేక ఇబ్బందులు పడుతుంటే, బయటి ప్రాంతాల నుంచి సరుకు తీసుకొచ్చే వ్యాపారులకు మాత్రం ప్రాధాన్యత లభిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, రైతు బజార్ల అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. రైతు బజార్ల అసలు లక్ష్యం రైతులకు ప్రత్యక్ష మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించడం, వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలు అందించడం. కానీ స్థానిక రైతుల పంటకు తగిన అవకాశాలు కల్పించకపోతే ఆ లక్ష్యం నీరుగారిపోతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానిక రైతులు అమ్మకాలు లేక నష్టపోతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో, బయటి ప్రాంతాల నుంచి వస్తున్న వంకాయల కొనుగోలు ధరలు, రవాణా వివరాలు, రైతు బజార్లలో విక్రయాలకు అనుమతుల ప్రక్రియను పరిశీలించాల్సిన అవసరం ఉంది.



# నైపుణ్యాలతోనే ఉన్నత స్థితికి రాగలరు

**డా॥ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి**

**గుంటూరు (జయ జయహే)**

విద్యార్థులు డిగ్రీలతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరగలరని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్, సేవాతత్పరులు డా॥ బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీన మానవత ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో గల అసెంబ్లీ హాలులో జరిగిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి పాల్గొని ప్రసంగించారు. మనతోపాటు స్వతంత్రం పొందిన చైనా సమాజం నైపుణ్యాలను ప్రజలందరికీ అందించడం ద్వారానే ప్రపంచంలో అత్యున్నత స్థాయికి చేరిందన్నారు. పోటీ ప్రపంచంలో అభివృద్ధి చెందాలంటే ప్రతిభ, కృషి, పట్టుదల, సమయ పాలన తోనే ముందుకు వెళ్ళగలమని తెలిపారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం, మైఖేల్ ఫారడే లాంటి ప్రతిభావంతుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలన్నారు. మాతృభాషతోపాటు ఆంగ్ల భాష పై మంచిపట్టు సాధిస్తేనే ప్రపంచ మార్కెట్ లో ఉపాధి పొందగలమన్నారు. సమాజంలో నిరంతరం వస్తున్న కొత్త కొత్త సాంకేతిక అంశాలను నేర్చుకుంటూ ఉండాలని లేకపోతే వెనుకబడి పోతామని వివరించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం 2008లో ప్రారంభించిన ఎన్ఎంఎంఎస్ పథకం ద్వారా ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి లక్ష మందికి సంవత్సరానికి 12 వేలు చొప్పున 4 సంవత్సరాల పాటు 48 వేల రూపాయలు ఉపకార వేతనాలు అందిస్తున్నారని, తద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, మధ్యలో బడి మానివేయడం తగ్గుతుందని తెలిపారు. మానవత చైర్మన్ వి.వి. నాగిరెడ్డి, అధ్యక్షులు పోలూరి వీరారెడ్డి ప్రసంగిస్తూ డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి గుంటూరు నగరంలో ప్రతి మంచి పనికి తోడ్పాటును అందించే సేవామూర్తి అని కొనియాడారు. అరుదైన ప్రాచీన గ్రంథాలను తిరిగి ముద్రించడం, ప్రతిభగల పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం, వివిధ రంగాలలో మహోన్నతులను గుర్తించి బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్ఫూర్తి అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో, భారతీయ విద్యా భవన్ లో, హీల్ సంస్థలో భవనాలు నిర్మించి విద్యా వ్యాప్తికి తోడ్పాటును అందించారని, పేద విద్యార్థులకు తోడ్పడే విధంగా హాస్టల్ ఏర్పాటు చేశారని తెలిపారు.

మానవత జిల్లా అధ్యక్షులు పావులూరి రమేష్ ప్రసంగిస్తూ డా॥ బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి 5 దశాబ్దాల పాటు పొగాకు వ్యాపారంలో నిబద్ధతతో, నిజాయితీతో కృషి చేశారని గత దశాబ్ద కాలంగా వ్యాపార కార్యక్రమాలను మానుకుని సేవా కార్యక్రమాలలో గుంటూరు నగరంలో అగ్రభాగాన నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మానవత కార్యదర్శి చావా శివాజీ తో పాటు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత మానవత సంస్థ ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా॥ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ని, విశిష్ట అతిథిగా విచ్చేసిన జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ని శాలువ కప్పి మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.



## విద్యుత్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

**ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్‌కు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం వినతి**

**విశాఖపట్నం, అక్టోబర్ 17, జయ జయహే**

విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం (టీఎన్‌వీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యమ్. శ్రీరాం మూర్తి కోరారు. ఈ మేరకు శనివారం ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీ తేజ్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఈపీడీసీఎల్ డిస్కం కార్యవర్గ సభ్యులను సీఎండీకి పరిచయం చేసి, విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై సంఘం తరపున వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన విషయాలను సీఎండీ దృష్టికి తీసుకువెళ్లారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ప్రత్యేక చొరవ చూపాలని, ఉద్యోగులకు న్యాయం జరిగేలా సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డిస్కం అధ్యక్షుడు బి.ఎం. నాయుడు, కార్యదర్శి బి.వి. రవీంద్ర, అదనపు కార్యదర్శి ఎం.కె. గణేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు తేజేశ్వరరావు, కోశాధికారి వైకుంఠరావు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఆర్.ఆర్. మూర్తి, జిల్లా కార్యదర్శి వేదుల నగేష్ తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.



## ఆర్ఐఎన్ఎల్‌లో 1,200 పదోన్నతులు

**ఏడేళ్ల నిరీక్షణకు తెర.. ఉద్యోగుల్లో నూతనోత్సాహం**

**విశాఖపట్నం, అక్టోబర్ 17, జయ జయహే**

విశాఖ స్టీల్ ప్లాంట్ కార్పొరేట్ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)లో 1,200 మందికి పైగా ఎగ్జిక్యూటివ్‌లకు వివిధ గ్రేడ్లలో పదోన్నతులు కల్పించారు. దాదాపు ఏడేళ్ల నిరీక్షణ అనంతరం లభించిన ఈ పదోన్నతులు ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. 2019 నుంచి పదోన్నతులు లేకపోవడంతో ఎదురుచూస్తున్న ఎగ్జిక్యూటివ్‌లకు తాజా నిర్ణయం కెరీర్ పురోగతికి, ఆత్మవిశ్వాసానికి ప్రోత్సాహాన్నిచ్చింది. నిర్ణీత ప్రమాణాలు, నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహించినట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సహకారం, ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం చొరవ, నిరంతర కృషితో ఈ దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది. యువ ఎగ్జిక్యూటివ్‌లకు కొత్త ఆశలు కల్పించడంతో పాటు, సీనియర్ ఉద్యోగుల అనుభవానికి గుర్తింపు లభించింది. పదోన్నతులు పొందిన ఉద్యోగులు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు, ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం తమలో బాధ్యతాభావం, నిబద్ధతను మరింత పెంచిందని పేర్కొన్నారు. భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఉత్పాదకత, సామర్థ్యం, నాణ్యతను పెంపొందించి సంస్థ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు.

## గంటాను కలిసిన మేయర్ అభ్యర్థి శ్రావణి

**విశాఖపట్నం (జయ జయహే)**

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును విశాఖ మేయర్ కూటమి అభ్యర్థి ముక్కా శ్రావణి కలిశారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన ఆమెను గంటా శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమికి ఈ ఎన్నికల్లో అఖండ విజయం ఖాయమన్నారు.



# శ్రీ మహాలక్ష్మీ స్వరూపిణిగా అమ్మవారి దివ్య దర్శనం

**శ్రీ సత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో వైభవంగా దసరా పాంచరాత్ర మహోత్సవాలు**

**విశాఖపట్నం, అక్టోబర్ 17, జయ జయహే**

ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో దసరా పాంచరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీ స్వరూపిణిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేశ పూజ, పుణ్యాహవాచనంతో ప్రారంభమైన కార్యక్రమంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళితో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం నీరాజనం, మహానైవేద్యం సమర్పించారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబాకు అర్చన, హారతి నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం నామస్మరణ, జప పారాయణం, భక్తి భజనలు నిర్వహించారు. మహాహారతి అనంతరం ప్రసాద వితరణతో కార్యక్రమం





ముగిసింది. పూజలను విశాఖ జిల్లా మహిళా ఆధ్యాత్మిక సమన్వయకర్త శ్రీమతి రాధా సత్యవరపు, పండితులు శ్రీ భాస్కర శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, రాష్ట్ర వేదం (మహిళా) ఇన్‌చార్జి శ్రీదేవి, సిటీ సేవా సమితి కన్వీనర్ బి. సాయి-కుమార్, ఇతర పదాధికారులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దివ్య దర్శనం, ప్రత్యేక పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను, భక్తిశ్రద్ధలను మరింత పెంపొందించాయి.



## 27 పంచాయతీల్లో సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు

**దేవరాపల్లి, అక్టోబర్ 17, జయ జయహే**

: మండలంలోని 27 పంచాయితీలకు సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఎన్.జి.నగరం ఎస్సీ మహిళ, రైవాడ, ముషిడిపల్లి, తారువ, కలిగొట్ల, చింతలపూడి, దేవరాపల్లి, నాగయ్యపేట, చింతలపూడి, జనరల్ రాగా, చిననందిపల్లి, ములకలాపల్లి, వాకపల్లి, మారేపల్లి, బిసి కాగా, కొత్తూరు ముత్యాలముపాలెం, ఏ. కొత్తపల్లి, బోయిలకింతాడ, తిమిరాం, బీసీ మహిళ కాగా, కాశీపురం ఎస్సీ, వాలాబు ఎస్ టి, గరిశింగి ఎస్ టి మహిళకు, తెనుగు పూడి, ఎం.అలమండ, మామిడిపల్లి బిసి జనరల్, వేచలం, తామరబ్బ, పెదనందిపల్లి, కొత్తపెంట, వెంకటరాజుపురం, జనరల్ మహిళ కు సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు ఏ ఆర్ ఓ, ఎంపీడీవో ఎస్ కిరణ్ వరప్రసాద్ తెలిపారు.

# స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

**జీవీఎంసీలో అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు**

**4 జెడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 3న ఎన్నికలు.. 5న ఫలితాలు**

**జిల్లాలోని 79 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు**

**సీపీ, జీవీఎంసీ కమిషనర్లతో కలిసి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ వెల్లడి**



**విశాఖపట్టణం, అక్టోబర్ 17, జయ జయహే**

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. జీవీఎంసీ ఎన్నికలతో పాటు పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, శిక్షణ, భద్రత, కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీపీవో శ్రీనివాసరావులతో కలిసి శనివారం సాయంత్రం కలెక్టరేట్ వీసీ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణ, పరిషత్, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు వివరాలను వెల్లడించారు.

**జీవీఎంసీ ఎన్నికలకు సమగ్ర ఏర్పాట్లు**

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 120 వార్డులకు అక్టోబర్ 28న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ 30న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటి వరకు మేయర్ స్థానానికి 7 నామినేషన్లు, కార్పొరేటర్ స్థానాలకు 331 నామినేషన్లు అందినట్లు కలెక్టర్ తెలిపారు. జీవీఎంసీ పరిధిలో మొత్తం 18,37,901 మంది ఓటర్లు ఉన్నారని, ఎన్నికల నిర్వహణకు 10,000 మందికి పైగా పోలింగ్ సిబ్బందిని గుర్తించి, మొదటి విడత శిక్షణ పూర్తి చేశామన్నారు. 41 మంది రిటర్నింగ్ అధికారులు, 41 మంది సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించామని చెప్పారు. పోలింగ్ సిబ్బందిని కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. పది జోన్లకు పది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఏయూలో తొమ్మిది భవనాల్లో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేశామని వివరించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్ రూములకు తరలించి, భద్రపరచనున్నట్లు వెల్లడించారు. కీలక, సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన అదనపు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలకు సంబంధించిన తదుపరి ప్రక్రియను కూడా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నామని చెప్పారు. మేయర్ అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిమితి రూ.40 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ.15 లక్షలుగా నిర్ణయించిన్లు పేర్కొన్నారు.

**జడ్పీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు**

జిల్లాలో నాలుగు జెడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ వెల్లడించారు. అక్టోబర్ 19న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా, అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. అక్టోబర్ 23 నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీగా, అక్టోబర్ 24న పరిశీలన ఉంటుందన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల పరిధిలో 1,72,980 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. 106 ప్రాంతాల్లో 203 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ నిర్వహణకు 25 రూట్లను గుర్తించి, 1,462 మంది సిబ్బంది సేవలందిస్తారని చెప్పారు. అవసరమైన మేరకు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు నాలుగు ఎంసీసీ బృందాలు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు, నాలుగు స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, రెండు వీడియో వీక్షణ బృందాలు, ఐదు వ్యయ పరిశీలన బృందాలు, ఐదు సింగిల్ విండో క్లియరెన్స్ డెస్కులను ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ అభ్యర్థులకు రూ.4 లక్షలు, జెడ్పీటీసీ అభ్యర్థులకు రూ.8 లక్షలు గరిష్ఠ ఎన్నికల వ్యయ పరిమితిగా నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలోని 79 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం 222 ప్రాంతాల్లో 802 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాకు ఏ దశలో ఎన్నికలు నిర్వహించనున్నారనే విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి నోటిఫికేషన్ వచ్చిన తర్వాత స్పష్టత వస్తుందని కలెక్టర్ తెలిపారు.

**మేయర్‌కు ఫింక్ కలర్, కార్పొరేటర్‌కు వైట్ కలర్ బ్యాలెట్లు**

జీవీఎంసీ పరిధిలో జరగనున్న మేయర్, కార్పొరేటర్ ఎన్నికల్లో రెండు బ్యాలెట్లపై రెండు ఓట్లు వేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పింక్ కలర్ బ్యాలెట్ మేయర్ అభ్యర్థిని, వైట్ కలర్ బ్యాలెట్ కార్పొరేటర్ అభ్యర్థిని సూచిస్తుందని స్పష్టం చేశారు. ఓటు వేశాక రెండు బ్యాలెట్ పేపర్లను ఒక బాక్సులోనే వేయాల్సి ఉంటుందని చెప్పారు. ఓటర్లు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

**6,607 మంది పోలీసులతో బందోబస్తు: పోలీస్ కమిషనర్**

జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. జీవీఎంసీ పరిధిలో 6,607 మంది పోలీసు సిబ్బందిని కేటాయిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల భద్రతతో పాటు రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్సెస్, చెక్‌పోస్టులు, స్టాటిక్ పికెట్లు, షాడో టీమ్స్, కంట్రోల్ రూమ్, స్ట్రాంగ్ రూములు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 177 రూట్ మొబైల్స్, 16 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా నాలుగు మండలాల్లోని 79 గ్రామ పంచాయతీల పరిధిలో బందోబస్తు ప్రణాళిక రూపొందించామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం 2,907 మంది పోలీసు సిబ్బందిని సమకూర్చుకుంటున్నట్లు వెల్లడించారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడి ప్రజలతో నేరుగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే టూ టౌన్, ఎయిర్‌పోర్ట్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటన జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర సమాచారాన్ని తన వ్యక్తిగత నంబర్ 79950 95799కు కూడా తెలియజేయవచ్చని సూచించారు.

## అరకు అసెంబ్లీ పరిధిలో స్థానిక ఎన్నికలకు

# ఆమ్ ఆద్మీ పార్టీ సన్నద్ధం: సుజాత సల్మాన్



**అరకులోయ: అక్టోబర్ 17. జయ జయహే.**

అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగిన అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు, సామాజిక కార్యకర్త సుజాత సల్మాన్ తెలిపారు. అరకు అసెంబ్లీ పరిధిలోని జెడ్పీటీసీ స్థానాలతో పాటు, ప్రతి మండలంలో ఎంపీటీసీ స్థానాల్లో పార్టీ తరఫున పోటీ చేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన, సేవాభావం, నిజాయితీ, సామాజిక బాధ్యత కలిగిన యువతీ యువకులు రాజకీయాల్లోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. డబ్బు, మద్యం, కులం, మతం, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించి, పారదర్శకమైన ప్రజాపాలన అందించడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, ఉపాధి వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల తరఫున పోరాడే నాయకత్వాన్ని తయారు చేయాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. అరకు అసెంబ్లీ పరిధిలో పార్టీ తరఫున స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న, ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగిన యువత, సామాజిక కార్యకర్తలు, ప్రజా సమస్యలపై పనిచేసే నాయకులు ముందుకు రావాలని సుజాత సల్మాన్ కోరారు. ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివరాల కోసం సంప్రదించండి ఫోన్: 9121730652

# ఐదో షెడ్యూల్‌లో 17 ఎంపీటీసీ స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా ఎలా ప్రకటిస్తారు?

**అరకులోయ , అక్టోబర్ 17 జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐదో షెడ్యూల్ ప్రాంతానికి సంబంధించి 17 ఎంపీటీసీ (మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం) స్థానాలను అన్‌రిజర్వ్‌డ్ (జనరల్) కేటగిరీగా ప్రకటించినట్లు వస్తున్న సమాచారంపై ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, రిజర్వేషన్లకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఆదివాసీల రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి**

ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేసే సమయంలో రాజ్యాంగ నిబంధనలు, సంబంధిత చట్టాలు, అమల్లో ఉన్న రిజర్వేషన్ విధానాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఆదివాసీల రాజకీయ ప్రాతినిధ్యానికి విఘాతం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



**17 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటించడానికి ఆధారాలేంటి?**

ఐదో షెడ్యూల్ ప్రాంతంలో 17 ఎంపీటీసీ స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటించడానికి ఆధారమైన చట్టపరమైన నిబంధనలు ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల రాజకీయ హక్కులకు భంగం కలగకుండా రిజర్వేషన్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

**రిజర్వేషన్లపై చట్టపరమైన సమీక్ష చేపట్టాలి**

రిజర్వేషన్ల ఖరారులో ఐదో షెడ్యూల్ ప్రాంతాల ప్రత్యేకతను, ఆదివాసీల రాజ్యాంగ హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని నాయకులు సూచించారు. సంబంధిత రిజర్వేషన్ల ప్రక్రియను చట్టపరంగా సమీక్షించి, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుని సరిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ఆదివాసీల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తాం**

ఆదివాసీల రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణే ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే ఆదివాసీ ప్రజాసంఘాలను ఏకం చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జేఏసీ అరకువేలి మండల కన్వీనర్ సమర్థి గోపాల్‌తో పాటు కో-కన్వీనర్లు కిల్లో ఆనంద్, కిల్లో బుద్ధు, కిల్లో రామచందర్, కొర్ర దేవా, కినంగి కొములు, వంతల కామేష్, బురిడీ ఉపేంద్ర, కిల్లో స్వామిరాజ్, సమర్థి భగత్, పాంగి మొస్య తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన జనసేన యువత

**తొట్టంబేడు, అక్టోబర్ 17, జయ జయహే**

తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన పలువురు జనసేన పార్టీ యువకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మండల నాయకుల ఆధ్వర్యంలో యువకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. చియ్యవరం గ్రామానికి చెందిన నాగభూషణం, ఏకాంబరం, మునిచంద్ర, సాయి, జయబాల్, నరేంద్ర, మురళి, మునికృష్ణయ్య, మునిరత్నం, శంకర్, పెంచలయ్య తదితరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఆపరేషన్ త్రిశూల్‌పై అవగాహన సదస్సు

**కొయ్యూరు :(జయ జయహే న్యూస్ ) అక్టోబర్ 18,**

అల్లూరి జిల్లా కొయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు చీడిపాలెం గ్రామాన్ని సందర్శించి, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, అల్లర్లకు పాల్పడవద్దని, ఎవరి ప్రలోభాలకు గురికావద్దని, ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆపరేషన్ త్రిశూల్ గురించి గంజాయి అక్రమ రవాణా, వినియోగం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, గ్రామంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు స్టేషన్ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## పూడి ఎంపీటీసీ బరిలోకి మున్నె దొరబాబు

**16 ఏళ్లుగా ప్రజాసేవలో.. బీజేపీలో కీలక బాధ్యతలు**

**తొట్టంబేడు, అక్టోబర్ 17, జయ జయహే**

తొట్టంబేడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పూడి ఎంపీటీసీ స్థానం నుంచి బీజేపీ నాయకుడు పండిటి మున్నె దొరబాబు పోటీ చేసే అవకాశాలపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఎస్సీ వర్గానికి ఈ స్థానం కేటాయించిన నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వంపై ఆసక్తి నెలకొంది. కోలా ఆనంద్ నాయకత్వంలో గత 16 ఏళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్న మున్నె దొరబాబు బీజేపీలో పలు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శిగా, పూడి, శేషంనాయుడు కండ్రిగ పంచాయతీల ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు పార్టీ అవకాశం కల్పిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఎన్నికలకు పోలీస్ ఉక్కు పాదం

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పీ నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 17:**

కొవ్వూరు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ఆదేశించారు. కొవ్వూరు సబ్డివిజన్ కార్యాలయంలో పోలీస్అధికారులతో ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలు, కీలక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట భద్రత కల్పించాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేయాలని ఆదేశించారు. చెక్పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసి అక్రమ నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువుల రవాణాను అడ్డుకోవాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, వదంతులు, విద్వేషపూరిత పోస్టుల ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పోలీస్స్టేషన్ పరిధిలోని వార్డులు, పోలింగ్ కేంద్రాలపై సమగ్ర సమాచారం సేకరించాలని, గత ఎన్నికలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలు



పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకులోనుకాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో కొవ్వూరు సబ్డివిజన్ డీఎస్పీ జి. దేవకుమార్తో పాటు సబ్డివిజన్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఎన్నికలకు పటిష్ట నిఘా!



## నామినేషన్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ కేంద్రాల పరిశీలన

**రాజమహేంద్రవరం:అక్టోబర్ 17 : జయ జయహే**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం కొవ్వూరు, నిడదవోలు మున్సిపల్ కార్యాలయాల్లో పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమీక్షించడంతో పాటు స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రత, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓటర్ల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ పరిశీలనలో కొవ్వూరు ఆర్డీవో కె. ఆనంద్ రావు, మున్సిపల్ కమిషనర్ జి. సందీప్, కొవ్వూరు సబ్ డివిజన్ డీఎస్పీ జి. దేవకుమార్, సౌత్ జోన్ డీఎస్పీ ఏ. శివప్రియ, కొవ్వూరు ఇన్‌స్పెక్టర్ పి. విశ్వం, నిడదవోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వి.జి. తిలక్‌తో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పూలే, అంబేద్కర్ ఆశయాలున్న వారికే మేయర్ పీఠం!

## అనర్హులకు టికెట్ ఇస్తే ప్రత్యామ్నాయ అభ్యర్థి

**రాజమహేంద్రవరం: అక్టోబర్ 17 జయ జయహే:**

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని, పూలే, అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి ప్రజాసేవ చేసే వ్యక్తికే మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బిసి,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ నేత సానబోయిన రామారావు మాట్లాడుతూ, దళితుల అభ్యున్నతి, విద్యాసంస్థలు, ఆశ్రమాల అభివృద్ధికి కృషి చేసే నాయకుడిని ఎంపిక చేయాలన్నారు. పూలే, అంబేద్కర్ ఆశయాలను ఆచరించని వారికి మేయర్ పదవి కట్టబెట్టడం తగదని స్పష్టం చేశారు. తమ డిమాండ్లను పట్టించుకోకుండా అనర్హులకు టికెట్ కేటాయిస్తే, అసోసియేషన్ తరఫున మేయర్ అభ్యర్థిని ప్రకటిస్తామని హెచ్చరించారు. జార్జ్




ఆంటోనీ మాట్లాడుతూ, చట్టాలపై అవగాహనతో పాటు నగరాభివృద్ధిపై స్పష్టమైన దృక్పథం ఉన్న వ్యక్తిని మేయర్‌గా ఎంపిక చేయాలని కోరారు. అవసరమైతే మైనార్టీల తరఫున స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని తెలిపారు. రాజమహేంద్రవరం స్థానికులకే మేయర్ పదవి ఇవ్వాలని కరుణాకర్ సూచించారు. ఎస్సీ, బిసి , మైనార్టీ వర్గాల సంక్షేమం, నగర సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని నేతలు కోరారు. ఈ సమావేశంలో సానబోయిన రామారావు, జార్జ్ ఆంటోనీ, గుమ్మడి సమర్పణ రావు, ఎల్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హద్దులు దాటిన పోలీసులపై రాహుల్ ధ్వజం

**జయ జయహే:**

దిల్లీ పోలీసుల తీరుపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్యం కోసం గళం విప్పుతున్న విద్యార్థులపై అలాగే మహిళా నిరసనకారులపై పోలీసులు దాడులు చేయడం, లైంగిక వేధింపులకు పాల్పడటం– ప్రజల గొంతుల్ని అణచి వేయడానికి జరుగుతున్న కుట్రలో భాగమని ఆయన విమర్శించారు. ప్రశ్నలు అడిగేందుకు ఎవరూ ధైర్యం చేయకుండా భయపెట్టడమే ఈ చర్యల వెనుక ఉద్దేశమని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. “విద్యార్థులు, మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరు అన్ని హద్దులు దాటింది. లైంగిక వేధింపులు, దుస్తులు లాగడం, శరీరంలోని సున్నిత భాగాలపై దాడులు చేయడం వంటి ఘటనలకు పోలీసులు పాల్పడ్డారు. ప్రజాస్వామ్యం కోసం ప్రశ్నిస్తున్న వారిని తీవ్రంగా భయపెట్టి, అవమానించి, భవిష్యత్తులో తమకు వ్యతిరేకంగా మళ్లీ గొంతు విప్పకుండా చేయాలనే ప్రయత్నం జరుగుతోంది. ప్రజాస్వామ్యం కోసం గొంతు విప్పుతున్న మహిళలు, విద్యార్థినులపై దిల్లీ పోలీసుల వైఖరి సిగ్గుచేటు. ప్రజల్ని తీవ్రంగా భయపెట్టి, అవమానించి ఇక మీదట ఎవరూ ప్రశ్నలు అడగకుండా చేయాలనే కుట్రలో భాగమే ఇది”

**మోదీ, అమిత్ షా పై విమర్శలు**

ఈ క్రమంలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను లక్ష్యంగా చేసుకొని కూడా రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారం తమ చేతుల్లో నుంచి చేజారిపోయే రోజు వస్తే, తమ ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశం ఇక ఉండదని, ఆ రోజు ముగుస్తుందని వారికి తెలుసని అన్నారు. ఆ భయమే పోలీసుల ద్వారా దేశంలోని యువత, మహిళలపై హింస రూపంలో బయటపడుతోందని ఆరోపించారు.

**బాధిత మహిళలతో మాట్లాడిన రాహుల్ గాంధీ**

తన పోస్టుతో పాటు రాహుల్ గాంధీ సుమారు 10 నిమిషాల వీడియోను కూడా ఎక్స్‌లో పంచుకున్నారు. ఇటీవల జరిగిన నిరసనల్లో పోలీసులు తమపై అమానుషంగా వ్యవహరించారని ఆరోపించిన కొందరు మహిళలతో ఆయన మాట్లాడిన దృశ్యాలు సదరు వీడియోలో ఉన్నాయి. యువతులు తమకు ఎదురైన చేదు అనుభవాలను వివరించారు. పోలీసులు తమ శరీరంలోని సున్నిత భాగాలను లక్ష్యంగా చేసుకున్నారని, పై అధికారులు కింది స్థాయి సిబ్బందిని లైంగికంగా వేధించేలా ప్రోత్సహించారని కూడా మహిళలు వీడియోలో వివరించారు. తమపై వేధింపులకు పాల్పడిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మహిళలు రాహుల్ గాంధీని కోరారు. దీనిపై స్పందించిన ఆయన, సంబంధిత పోలీసులపై కేసులు నమోదు చేయడానికి వీలుగా మరిన్ని ఆధారాలు అందించాలని సూచించారు. ఫొటోలు, వీడియోలు వంటి ఆధారాలను సేకరించి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఈ ఆధారాలను బట్టి కేసులు నమోదు చేసే ప్రక్రియలో ముందుకు వెళ్లొచ్చని ఆయన పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియను (ప్రత్యేక సమగ్ర సవరణ) నిరసిస్తూ దీనికి వ్యతిరేకంగా కొద్ది రోజులుగా దిల్లీ సహా పలు ప్రాంతాల్లో నిరసనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే విద్యార్థులు ఇటీవల నిరసనలు చేపట్టిన సమయంలో దిల్లీ పోలీసులు అమానుషంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై రాహుల్ గాంధీ స్పందించారు. బాధిత విద్యార్థులపై జరిగిన దాడులపై కేసు నమోదు చేసేందుకు దిల్లీ పోలీసులు నిరాకరిస్తున్నారని వ్యాఖ్యానించిన ఆయన, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దిల్లీ పోలీసు దాడుల్లో గాయపడ్డ కేరళ, రాజస్థాన్‌కు చెందిన పలువురు ఎన్ ఎస్ యు ఐ సభ్యులు, విద్యార్థి సంఘాల నేతలతో రాహుల్ సమావేశం అయ్యారు. విద్యార్థులు వారికి ఎదురైన అనుభవాల్ని రాహుల్‌కు వివరించారు. ఫిర్యాదుల్ని స్వీకరించడానికి దిల్లీ పోలీసులు తిరస్కరించడంతో రాహుల్ మరో ప్రత్యామ్నాయం ఎంచుకున్నారు. కేరళ, రాజస్థాన్‌లో దిల్లీ పోలీసులపై జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించారు.



## పేద విద్యార్థులకు నూతన వస్త్రాల పంపిణీ

### విక్రమ్ కళాశాల 1998--2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమం

### సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతామన్న పూర్వ విద్యార్థులు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 17, జయ జయహే**

శ్రీకాళహస్తి దసరా నవరాత్రుల సందర్భంగా విక్రమ్ కళాశాల 1998--2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని శివం టు శివం రోడ్డు సమీపంలో ఉన్న లంకమిట్ట ప్రాంతంలో 40 మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పండుగ వేళ చిన్నారులకు కొత్త దుస్తులను అందించి వారి ముఖాల్లో ఆనందం నింపారు. విక్రమ్ కళాశాలలో చదువుకున్న ఈ పూర్వ విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తయినప్పటికీ తమ స్నేహబంధాన్ని కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రథోత్సవం సందర్భంగా, కొండ చుట్టూ అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ తమ సేవా స్ఫూర్తిని చాటుకుంటున్నారు. ఈసారి దసరా నవరాత్రుల సందర్భంగా లంకమిట్టలోని పేద విద్యార్థులకు నూతన వస్త్రాలను పంపిణీ చేయాలని నిర్ణయించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సరస్వతి శిశు మందిర్‌లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు సైతం ఈ సేవా కార్యక్రమానికి సహకరించారు. వారిలో ఇద్దరు అందించిన సహకారంతో వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. భవిష్యత్తులోనూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తెలిపారు. పేదలకు, నిరుపేద విద్యార్థులకు తమ వంతు సహకారం అందిస్తూ సామాజిక బాధ్యతను కొనసాగిస్తామని పేర్కొన్నారు. పండుగ వేళ పేద విద్యార్థులకు నూతన వస్త్రాలను అందించిన పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## సుధీర్ రెడ్డితోనే బీసీలకు న్యాయం

### తెలుగు యువత ఉపాధ్యక్షుడు వంకాయల సిద్దలయ్య

**శ్రీకాళహస్తి అక్టోబర్ 17, జయ జయహే,**

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని బి అంటే బొజ్జల –బీసీలు అని శ్రీకాళహస్తి తెలుగు యువత ఉపాధ్యక్షుడు వంకాయల సిద్దులయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొన్ని వర్గాలకే పరిమితమైన రాజకీయ అధికారం, సాధికారతను బిసిలకు అందించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని కొనియాడారు. నియోజకవర్గంలో గతంలో స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆచరించిన విధంగానే నేడు వారి కుమారుడు బొజ్జల సుధీర్ రెడ్డి బీసీలకు న్యాయం చేస్తున్నాడని తెలిపారు. అలాగే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 40 శాతం స్థానాలు కేటాయించడం ఆనందంగా ఉందని కొనియాడారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ



చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించడంతో బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి బీసీ నాయకులు ఘనంగా సత్కరించారు. కూటమి నాయకుల భాగస్వామ్యంతో మున్సిపల్ చైర్మన్ పదవిని సొంతం చేసుకుంటామని తెలియజేశారు.

## మత్స్యకార సంక్షేమ సమితి నూతన అధ్యక్షుడు గాంధీకి సత్కారం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 17, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ కావమ్మ గుడి వీధిలో ఉన్న శ్రీ కావమ్మ మందిరం వద్ద మత్స్యకార సంక్షేమ సమితి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గంగపుత్ర గాంధీని డా. చంద్రప్ప మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకార సంక్షేమ సమితి నూతన కార్యవర్గ ఎంపిక, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, మత్స్యకారుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి సమితి తరపున



చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మత్స్యకార సంక్షేమ సమితి సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు నూతన అధ్యక్షుడు గంగపుత్ర గాంధీ తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి బెస్త సంఘ పెద్దలు, ప్రముఖులు, సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని గంగపుత్ర గాంధీ విజ్ఞప్తి చేశారు. మత్స్యకారుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై తమ విలువైన సూచనలు, సలహాలు అందించి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రియుడి కోసం భర్త హత్య

(ప్రతాప్)



అన్నయ్య ఆరోగ్యం బాగోలేదంటూ వచ్చిన ఫోన్‌కాల్‌తో హుటాహుటిన ఇంటికి చేరుకున్న తమ్ముడికి ఊహించని దృశ్యం ఎదురైంది. మంచంపై నిర్జీవంగా పడివున్న అన్నయ్య.. మెడపై కత్తిగాయాలు.. చుట్టూ రక్తపు మరకలు! అనారోగ్యమనుకున్న ఘటన హత్యగా మారడంతో కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పోలీసుల దర్యాప్తు మొదలైన కొద్ది గంటల్లోనే అనుమానాలు ఇంట్లోవారి వైపు మళ్లాయి. చివరకు మృతుడి భార్య, ఆమె ప్రియుడే హత్య కేసులో నిందితులుగా అరెస్టయ్యారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో వెలుగుచూసిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లా కున్వర్‌పూర్ గ్రామానికి చెందిన గోపాల్ (40) పదిహేనేళ్లుగా ఫరీదాబాద్‌లో నివసిస్తున్నాడు. డీఎల్‌ఎఫ్ పారిశ్రామిక ప్రాంతంలోని ఓ కర్మాగారంలో మెషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య కాజల్ (35) పిల్లలతో స్వగ్రామంలో ఉంటోంది. అదే గ్రామానికి చెందిన యోగేంద్ర (37)తో ఆమెకు వివాహేతర సంబంధం ఉందనే విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

అక్టోబర్ 13న కాజల్ పిల్లలతో కలిసి ఫరీదాబాద్‌కు వచ్చి శ్యామ్ కాలనీలోని బంధువుల ఇంట్లో దిగింది. మరుసటి రాత్రి గోపాల్ అక్కడికి వెళ్లాడు. పోలీసుల ప్రాథమిక కథనం ప్రకారం, మద్యం మత్తులో ఉన్న గోపాల్ నిద్రలోకి జారుకున్న అనంతరం కాజల్ కత్తితో అతని మెడపై దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. తీవ్ర గాయాలతో గోపాల్ ప్రాణాలు కోల్పోయాడు.




అక్టోబర్ 15 ఉదయం గోపాల్ కుమార్తె తన బాబాయి భూరాకు ఫోన్ చేసి తండ్రి ఆరోగ్యం బాగోలేదని తెలిపింది. వెంటనే అక్కడికి చేరుకున్న భూరా, అన్నయ్య మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. మెడపై కత్తిగాయాలు కనిపించడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి.

పల్లా పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భూరా ఇచ్చిన ఫిర్యాదులో కాజల్, యోగేంద్ర సంబంధం గురించి ప్రస్తావించడంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు. దంపతుల మధ్య గతంలో జరిగిన గొడవలు, హత్యకు ముందు చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలించారు. విచారణలో భర్తను అంతమొందించేందుకు యోగేంద్రతో కలిసి కుట్ర పన్నినట్లు కాజల్ అంగీకరించిందని పోలీసులు వెల్లడించారు. అయితే హత్య జరిగిన సమయంలో యోగేంద్ర ఘటనా స్థలంలో లేదని, కుట్రలో అతని ప్రమేయం ఉందని ప్రాథమికంగా పేర్కొన్నారు. డీఎల్‌ఎఫ్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు స్వగ్రామంలో ఉన్న ఇద్దరినీ అక్టోబర్ 16న అరెస్టు చేశారు. హత్యకు సంబంధించిన పూర్తి పరిణామాలను తెలుసుకునేందుకు విచారణ కొనసాగిస్తున్నారు.

ఒకప్పుడు ప్రేమతో ఏర్పడిన దాంపత్యబంధం చివరకు హత్య కేసుగా మారడం విషాదకరం. ఈ ఘటనతో పిల్లలు తండ్రిని కోల్పోగా, తల్లి అరెస్టుతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. అనారోగ్యమంటూ వచ్చిన ఒక్క ఫోన్‌కాల్‌తో మొదలైన అనుమానం.. చివరకు కుటుంబంలోనే దాగున్నట్లు పోలీసులు ఆరోపిస్తున్న హత్య కుట్రను వెలుగులోకి తెచ్చింది.

## డేటా సెంటర్ల విస్తరణ..

# ప్రకృతి వనరులకు సవాలు!

(ప్రతాప్)



**కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని శరవేగంగా మార్చేస్తోంది. డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు, క్లౌడ్ కంప్యూటింగ్, సమాచార నిల్వలకు ఆధారమైన డేటా సెంటర్లు ఆధునిక ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారుతున్నాయి. అయితే ఈ సాంకేతిక విప్లవం వెనుక భారీ విద్యుత్ వినియోగం, శీతలీకరణకు అవసరమైన నీరు, పర్యావరణంపై పెరుగుతున్న ఒత్తిడి వంటి సవాళ్లు దాగున్నాయి. డిజిటల్ అభివృద్ధి కోసం నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలే భవిష్యత్తులో ప్రకృతి వనరులపై భారంగా మారకుండా చూడటం అత్యవసరం. సాంకేతిక ప్రగతికి పర్యావరణ పరిరక్షణను అనుసంధానించడమే నేటి ప్రధాన అవసరం.**

ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనాల ప్రకారం 2024లో డేటా సెంటర్లు సుమారు 415 టెరావాట్ గంటల విద్యుత్‌ను వినియోగించాయి. ఇది ప్రపంచ మొత్తం విద్యుత్ వినియోగంలో దాదాపు 1.5 శాతం. కృత్రిమ మేధస్సు విస్తరణతో 2030 నాటికి ఈ అవసరం 945 టెరావాట్ గంటలకు చేరవచ్చని అంచనా. అంటే ఆరేళ్లలోనే వినియోగం రెట్టింపుకంటే ఎక్కువయ్యే అవకాశముంది. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్‌లో వాటి వాటా మూడు శాతానికి చేరువయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

భారతదేశంలోనూ డేటా సెంటర్ల విస్తరణ వేగవంతమవుతోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ వివరాల ప్రకారం 2020లో సుమారు 375 మెగావాట్లుగా ఉన్న దేశ డేటా సెంటర్ల సామర్థ్యం 2025 నాటికి 1,500 మెగావాట్లకు చేరింది. ఐదేళ్లలో నాలుగురెట్లు పెరగడం డిజిటల్ రంగంలో ఏర్పడుతున్న అవకాశాలను సూచిస్తోంది. జేఎల్‌ఎల్ సంస్థ 2026 అంచనాల ప్రకారం ప్రస్తుత 1.6 గిగావాట్ల సామర్థ్యం 2029 నాటికి ఆరు గిగావాట్లకు చేరవచ్చు. ఇందుకు దాదాపు 110 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని అంచనా. ఈ విస్తరణతో ఉపాధి, నిర్మాణరంగం, సాంకేతిక పరిశ్రమలకు అవకాశాలు పెరుగుతాయి. అదే సమయంలో విద్యుత్, నీటి అవసరాలు కూడా గణనీయంగా పెరుగుతాయి.

ముఖ్యంగా ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో డేటా సెంటర్లు ఎక్కువగా కేంద్రీకృతమయ్యాయి. సీబీఆర్‌ఈ నివేదిక ప్రకారం 2025 సెప్టెంబర్ నాటికి దేశ డేటా సెంటర్ల సామర్థ్యంలో ముంబై వాటా 53 శాతం, చెన్నై వాటా 20 శాతం. ఈ నగరాల్లో ఇప్పటికే గృహావసరాలు, పరిశ్రమలు, రవాణా వ్యవస్థల కోసం భారీగా విద్యుత్ అవసరమవుతోంది. కొత్త డేటా సెంటర్లతో స్థానిక విద్యుత్ పంపిణీ వ్యవస్థలపై అదనపు ఒత్తిడి ఏర్పడకుండా ముందస్తు ప్రణాళిక అవసరం.

విద్యుత్‌తోపాటు నీటి వినియోగం మరో కీలకమైన సమస్య. సర్వర్లు నిరంతరం పనిచేసేటప్పుడు ఉత్పత్తయ్యే వేడిని తగ్గించడానికి భారీ శీతలీకరణ వ్యవస్థలు అవసరమవుతాయి. కొన్ని శీతలీకరణ పద్ధతుల్లో నీటి వినియోగం అధికంగా ఉంటుంది. అయితే ప్రతి డేటా సెంటర్ ఒకే పరిమాణంలో నీటిని వినియోగించదు. వాతావరణ పరిస్థితులు, శీతలీకరణ సాంకేతికత, భవనం సామర్థ్యాన్ని బట్టి అవసరాలు మారుతాయి. అందువల్ల నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులను అనుమతించే ముందు స్థానిక జలవనరులపై ప్రభావాన్ని సమగ్రంగా అంచనా వేయాలి.

ఇటీవల నీతి ఆయోగ్ సూచించిన విధంగా డేటా సెంటర్ల అనుమతులకు ముందే విద్యుత్, నీటి లభ్యతను పరిశీలించడం మంచి ముందడుగు. శుద్ధిచేసిన మురుగునీటి పునర్వినియోగం, నీటిని ఆదా చేసే శీతలీకరణ పద్ధతులు, విద్యుత్ సామర్థ్యాన్ని పెంచే ఆధునిక పరికరాలను ప్రోత్సహించాలి. పరిశ్రమలు తమ విద్యుత్, నీటి వినియోగ వివరాలను పారదర్శకంగా వెల్లడించే వ్యవస్థ అవసరం.

పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని విస్తరించడం కూడా అత్యవసరం. అంతర్జాతీయ ఇంధన సంస్థ ప్రకారం ప్రపంచ డేటా సెంటర్ల విద్యుత్ అవసరాల్లో ప్రస్తుతం సుమారు 27 శాతం పునరుత్పాదక వనరుల నుంచి లభిస్తోంది. ఈ వాటాను పెంచేందుకు సౌర, పవన విద్యుత్‌తోపాటు బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. విద్యుత్ పొదుపును ప్రోత్సహించే పరికరాలు, సమర్థవంతమైన సర్వర్లు, వ్యర్థ ఉష్ణ వినియోగంపై పరిశోధనలను విస్తరించాలి.

భారతదేశం డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ప్రపంచ అగ్రగామిగా ఎదగడం స్వాగతించదగిన లక్ష్యం. అయితే అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులపై అదుపులేని ఒత్తిడిని అనుమతించకూడదు. డేటా సెంటర్ల విజయాన్ని వాటి సామర్థ్యం, పెట్టుబడుల పరిమాణంతో మాత్రమే కాకుండా విద్యుత్ సామర్థ్యం, నీటి పొదుపు, పునరుత్పాదక ఇంధన వినియోగంతోనూ కొలవాలి. డిజిటల్ విప్లవం ప్రకృతి విధ్వంసానికి దారితీయకూడదు. సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందినా భూమి భవిష్యత్తును పరిరక్షించే బాధ్యతను విస్మరించరాదు. పర్యావరణానికి హాని కలిగించని డిజిటల్ ప్రగతే నిజమైన సుస్థిర అభివృద్ధి!



## వార్డు సభ్యులుగా

# భారీగా నామినేషన్స్

**ఒక్క రోజే పోటీకి 528 నామినేషన్లు దాఖలు.**

**రెండు రోజుల్లోనే 594 నామినేషన్లు**

**విశాఖపట్నం, అక్టోబర్ 17, జయ జయహే :**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండవ సాధారణ ఎన్నికలు--2026కు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా రెండో రోజైన శనివారం వార్డు సభ్యుల పోటీలకు 528 నామినేషన్లు దాఖలైనట్లు జీవీఎంసీ ఆయా జోన్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం (అక్టోబర్ 17) వార్డు సభ్యుల పోటీకి జోనుల వారీగా అందిన నామినేషన్ వివరములు: భీమిలి -- 11, మధురవాడ -31 , తూర్పు -- 41 , సౌత్ -- 107, నార్త్ -- 61, వెస్ట్-57, గాజువాక -- 150, అగనంపూడి -- 34, అనకాపల్లి -- 01 , పెందుర్తి -- 35 నామినేషన్లు దాఖలు అయ్యాయని తెలిపారు. వార్డు సభ్యుల నామినేషన్లకు సంబంధించి ఆయా జోన్లలో అక్టోబర్ 16, 17 తేదీలలో బహుజన్ సమాజ్ పార్టీ--4, భారతీయ జనతా పార్టీ--17, భారత కమ్యూనిస్టు పార్టీ--2, సీపీఎం--7, కాంగ్రెస్ పార్టీ--9, తెలుగుదేశం పార్టీ--155, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ--190, జనసేన పార్టీ--108, ఇతర పార్టీలు--7, స్వతంత్ర అభ్యర్థులు--95 మొత్తంగా వార్డు సభ్యుల పోటీకి 594 నామినేషన్లు దాఖలైనట్లు ఆయా జోన్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన అక్టోబర్ 16న వార్డు సభ్యుల కు 66 నామినేషన్లు దాఖలు కాగా, అక్టోబర్ 17న 528 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో రెండు రోజుల్లో కలిపి మొత్తం 594 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. అలాగే మేయర్ అభ్యర్థులకు సంబంధించి 7 నామినేషన్లు వచ్చాయి.



## స్థానిక ఎన్నికల్లో జనసేనకు

# 40 శాతం కోటా ఇవ్వాలి

**శ్రీకాళహస్తి జనసేన నేతల డిమాండ్**

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 17, జయ జయహే**

శ్రీకాళహస్తి స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీకి 40 శాతం ప్రాతినిధ్య కోటా కేటాయించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నగిరి వీధి సదాశివ టవర్స్‌లో స్థానిక ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ జనసేన సమన్వయకర్త మిద్దెల హరి, అసెంబ్లీ సమన్వయకర్తలు కొట్టే సాయి ప్రసాద్, సత్రవాడ ప్రవీణ్, దండి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కూటమి నాయకులైన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్‌తో చర్చించి, జనసేనకు రావాల్సిన కోటాపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కూటమి పార్టీల మధ్య సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో జనసేన విజయానికి కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ప్రాంత నాయకులు దావాలగిరి, గంజి వెంకటేష్, హరి, బాలిశెట్టి నరసింహులు, పోలి గణేష్, లీలా మోహన్, వేణుగోపాల్, మునిశేఖర్, పోలా సాయి, ప్రసాద్, చెర్లోపల్లి అజయ్, నవీన్, పసల గురవయ్య తొట్టంబేడు నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవితో పాటు శ్రీకాళహస్తి మండల నాయకులు బి. వెంకటరత్నం, అజయ్ కుమార్, వరదరాజులు, గంధం ఢిల్లీ కుమార్, రేణిగుంట మండల నిర్వాహక సభ్యులు ఆకుల భాగ్యలక్ష్మి, మహబూబ్ బాషా, తిలక్, త్యాగరాజులు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## 19న ప్రజా సమస్యల

# పరిష్కార వేదిక రద్దు

**కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్ ప్రకటన**

**తిరుపతి, అక్టోబర్ 17, జయ జయహే**




తిరుపతి స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ సందర్భంగా ఈ నెల 19వ తేదీ సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఫిర్యాదులు, అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com